నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
కర్నూలు | నంద్యాల
శనివారం | 29 మార్చి 2025 పేజీలు 8

# ఘనంగా ఇఫ్తార్ వేడుకలు

**ముస్లింలకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి టీ జీ భరత్, కలెక్టర్ రంజిత్ బాష**

**కల్లూరు, మేజర్ న్యూస్ :** మహమ్మద్ ప్రవక్త సందేశాలు సమాజానికి స్ఫూర్తిదాయకమని రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యం,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. శుక్రవారం స్థానిక రాష్ట్ర ప్రభుత్వ అతిధి గృహంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు మైనారిటీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ,జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా,

మిగతా 2లో



ఇఫ్తార్ విందులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న మంత్రి టిజి,కలెక్టర్

- మహాదుర్గగా దర్శనమిచ్చిన శ్రీశైల భ్రమరి
- కన్నడ భక్తులతో పోటెత్తిన శ్రీశైలం
- నేడు ప్రభోత్సవం,నంది వాహనసేవ, వీరాచార విన్యాసాలు

**శ్రీశైలం,మేజర్ న్యూస్:** ఇల కైలాసమైన శ్రీశైలంలో ఉగాది మహోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి.రెండోరోజు శుక్రవారం శ్రీగిరిలో భ్రమరాంబాదేవి మహాదుర్గ అలంకారంలో భక్తులకు దర్శనమివ్వగా, భ్రమరాంబా సమేత మల్లికార్జునుడు కైలాస వాహనాన్ని అధిష్టించి భక్తులను అనుగ్రహించారు. అమ్మవారు ఎనిమిది భుజాలతో శోభిల్లుతూ భక్తులను కటాక్షించారు. శంఖం, చక్రం,గద,పద్మం,త్రిశూలం,ఖడ్గం ధరించి

మిగతా 2లో

# కైలాస వాహనాధీశా




# నమోనమః



ప్రజా సమస్యలను పరిష్కరించే దిశలో

# ముందడుగు

- మీ సమస్య - మా పరిష్కారం కార్యక్రమానికి శ్రీకారం
- జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాతో కలిసి ప్రజల సమస్యలు తెలుసుకున్న మంత్రి టీజీ భరత్
- అక్కడికక్కడే పలు సమస్యలకు పరిష్కారం

**కర్నూలు స్పోర్ట్స్, మేజర్ న్యూస్ :** ప్రజా సమస్యలను పరిష్కరించే దిశలో తాము ముందుకువెళ్తున్నామనిరాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు నియోజకవర్గ ప్రజల నుండి సమస్యలు తెలుసుకొని పరిష్కరించడం కోసం ఆయన మీ సమస్య – మా పరిష్కారం కార్యక్రమానికి ఆయన శ్రీకారం చుట్టారు. కర్నూలు లోని తన కార్యాలయంలో శ్రీ ఆర్య ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమాన్ని ప్రారంభించి జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషాతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు.కర్నూలు నగరంలోని వివిధ వార్డుల నుండి ప్రజలు వచ్చి త్రాగునీటి సమస్యలు, విద్యుత్ స్తంబాలు, డ్రైనేజీ,

మిగతా 2లో



దివ్యాంగుడి సమస్య తెలుసుకుంటున్న మంత్రి

రైతుల పెట్టుబడి తగ్గాలి..

# తలసరి ఆదాయం పెరగాలి

**బీడు భూముల్లో ఉద్యాన పంటలను ప్రోత్సహించాలి**

**నంద్యాల కల్చరల్, మేజర్‌న్యూస్ :** జిల్లాలో ఖరీఫ్ చివరలో 2లక్షల ఎకరాల్లో మూడు నెలలు శనగపంట సాగుకు మాత్రమే పరిమితమై మిగిలిన కాలాన్ని వృధాగా ఉంచుతున్న బీడు భూముల్లో ఉద్యాన పంటలు వేసుకొనేలా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి వెల్లడించారు. శుక్రవారంకలెక్టరేట్‌లోని సెంటినరీ హాలులో నాణ్యమైన ఉల్లి, మిర్చి, పసుపు పెంపకం కోసం హార్టికల్చర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి వర్క్‌షాపు కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా

మిగతా 2లో




హార్టికల్చర్ జిల్లాస్థాయి వర్క్‌షాపు సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

# సమాజంలో పేదలకు అండగా ఉండేందుకే పీ -4

- కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్,ఎమ్మెల్యేలు

**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** సమాజంలో పేదలకు అండగా ఉండేందుకు రాష్ట్ర ప్రభుత్వం పీ–4 విధానాన్ని అమలు చేస్తోందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు.శుక్రవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో పేదరిక నిర్మూలనకు పీ –4 (ప్రభుత్వ, దాతల, ప్రజల భాగస్వామ్యం) విధానం పై స్టేక్ హోల్డర్లతో, ఇండస్ట్రియల్ అసోసియేషన్స్, ఛాంబర్ ఆఫ్ కామర్స్, ప్రముఖులు తదితరుల తో చర్చించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047లో భాగంగా ముఖ్యమంత్రి పేదరికం లేని సమాజంగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశ్యంతో పీ–4 కార్యక్రమాన్ని ఉగాది నాడు ప్రారంభించనున్నారని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10 శాతం మంది అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందికి చేయూతనివ్వడం ఈ కార్యక్రమం లక్ష్యం అని కలెక్టర్ పేర్కొన్నారు. వీరిని గుర్తించేందుకు గత నెల 25వ తేది నుండి

మిగతా 6లో

సూర్య



# ఘనంగా ఇఫ్తార్ వేడుకలు

(మొదటి పేజీ తరువాయి)



పాణ్యం పత్తికొండ, కోడుమూరు శాసనసభ్యులు గౌరు చరిత రెడ్డి, కేఈశ్యాంబాబు, బొగ్గుల దస్తగిరి, టిడిపి జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, మైనారిటీ సంక్షేమ అధికారి సబిహ పర్వీన్, ముస్లిం మతపెద్దలు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రంజాన్ పండుగ నిర్వహించుకుంటున్న ముస్లిం సోదరులందరికీ ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ముస్లింలకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతొందని, ఆ పథకాలను ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.మసీదులోని మౌజర్లు,ఇమామ్‌లకు, గత ప్రభుత్వ హయాంలో రూ 3000, రూ 5000 ఉండేది కానీ ఇప్పుడు రూ 5000, రూ10000 చేశామన్నారు. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ముస్లిం యూనివర్సిటీకి అన్ని ఏర్పాట్లు చేయగా గత ప్రభుత్వం ముస్లిం యూనివర్సిటీకి ఏమాత్రం నిధులు కేటాయించలేదని ప్రస్తుత కూటమి ప్రభుత్వం ముస్లిం యూనివర్సిటీ పూర్తిచేసే చర్యలు చేస్తుందని తెలిపారు. గత ప్రభుత్వం ముస్లిం మైనారిటీల సంక్షేమానికి దాదాపు 4000 కోట్లు కేటాయించగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ 5300 కోట్ల బడ్జెట్ ను ప్రభుత్వం కేటాయించిందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున కర్నూలు జిల్లా ప్రజలకు ఇఫ్తార్ విందు ఇవ్వడం భాగ్యంగా భావిస్తున్నానన్నారు.జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని ముస్లిం సోదరులందరికీ అడ్వాన్స్ రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు . ఈ రంజాన్ మాసాన్ని మనం ఎంత పవిత్రంగా జరుపుకుంటామో అందరికీ తెలిసిన విషయం అని శాంతి, సౌభాతృత్వం గురించి మహమ్మద్ ప్రవక్త మనకు అందరికీ చెప్పిన సందేశాన్ని గుర్తుచేసుకుంటూ వారి స్ఫూర్తితో మనం అందరం కూడా సమసమాజ నిర్మాణానికి , మహమ్మద్ ప్రవక్త ఇచ్చిన సందేశాన్ని అందరికీ తెలియజేసుకుంటూ వారిని గౌరవించుకుంటూ అల్లాహ్‌కు ప్రార్థన చేసుకోవడానికి అవకాశం ఇచ్చిన మీ అందరికీ కూడా ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలియజేశారు.జిల్లా యంత్రాంగం తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ప్రార్థనలు ముగిసిన తరువాత ముస్లిం మత పెద్దలు, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, నాయకులు కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. మంత్రి టీజీ భరత్ మరియు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా ఇఫ్తార్ సందర్భంగా ముస్లిం సోదరులకు భోజనం వడ్డించారు.కార్యక్రమంలో పట్టణ డిఎస్పీ బాబు ప్రసాద్, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, ముస్లిం మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబిహా పర్వీన్, జాయింట్ డైరెక్టర్ పశు సమర్ధక శాఖ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఎస్‌ఏపీ క్యాంప్ డిఎస్పి మహబూబ్ బాషా, ముస్లిం మత పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# కైలాస వాహనాధీశా నమోనమః

(మొదటి పేజీ తరువాయి)



అభయమిచ్చారు.ఉగాది మహోత్సవాల్లో రోజువారి కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం 7.30 గంటలకు చండీశ్వరపూజ, మండపారాధన, లోక కల్యాణం కోసం జపానుష్ఠానాలు నిర్వహిం చారు.9గంటలకు స్వామివారి యాగశాలలో రుద్రహోమం, అమ్మవారి యాగశాలలో చండీహోమం నిర్వహించారు. అమ్మవారికి విశేష కుంకుమార్చన, నవావరణార్చనలు,సాయంత్రం జపానుష్ఠాన ములు జరిపించారు. అనంతరం ఉభయ దేవాలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో కైలాస వాహనాన్ని ఆలయ ప్రదక్షిణ నిర్వహించారు. అనంతరం రాజగోపురం మీదుగా క్షేత్ర ప్రధాన వీధుల్లోకి తొడ్కొనివచ్చారు.క్షేత్ర పురవీధుల్లో కన్నడ భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని నీరా జనాలు సమర్పిం చారు. గ్రామోత్సవం గంగాధర మండపం నుంచి నంది మం డపం వరకు అక్కడి నుంచి బయలు వీరభద్రస్వామి ఆలయం వరకుకొనసాగింది. గ్రామోత్సవంలో కోలాటం,చెక్కభజన,బుట్టబొమ్మలు, గొరవయ్యల నృత్యం,తప్పెట్లు,కొమ్మువాయిద్యాలు ఆకట్టుకున్నాయి.

**శ్రీశైలంలో నేడు.. :** ఉగాది మహోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు





అదిష్టించిన స్వామి అమ్మవార్లకు అర్చకులు, వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.మహాదుర్గ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారికి ప్రత్యేక హారతులిచ్చారు.మహాదుర్గగా అలంకీకృతులైన భ్రమరాంబాదేవిని,కైలాసవాహనాధీశులైన స్వామిఅమ్మవార్లను ప్రభోత్సవం నిర్వహిస్తారు.స్వామి అమ్మవార్లకు నందివాహన సేవ, శ్రీభ్రమరాంబాదేవికి మహాసరస్వతి అలంకార సేవ నిర్వహిస్తారు. రాత్రి 10 గంటలకు వీరశైవుల వీరాచార విన్యాసాలు,అగ్నిగుండ ప్రవేశం నిర్వహిస్తారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించేదిశలో ముందడుగు

(మొదటి పేజీ తరువాయి)



ప్రజల నుండి సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి టీజీ భరత్,కలెక్టర్

పింఛన్లు, ల్యాండ్ సమస్యలు, ఉద్యోగాల కొరకు అప్లికేషన్లు, ప్రభుత్వాసుపత్రికి సంబంధించిన సమస్యలు, రెవెన్యూ సేవలు, ముఖ్యమంత్రి సహాయ నిధి దరఖాస్తులు, ప్రాపర్టీ టాక్స్, రోడ్లు, పార్కులు, పలు అభివృద్ధి పనులు చేయాలంటూ మొత్తం 144 సమస్యలను ప్రజలు మంత్రికి వినతిపత్రాలు అందించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం వచ్చిన దరఖాస్తులు తీసుకొని వెంటనే సహాయం అందేలా కృషి చేస్తామని బాధితులతో మంత్రి చెప్పారు. దీంతో పాటు త్రాగునీటి సమస్యలను వెంటనే మున్సిపల్ కమిషనర్‌కు చెప్పి పరిష్కరించాలని చెప్పారు. నిరుద్యోగులతో మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ట్రైనింగ్ కోసం ఏర్పాటుచేసిన సీడ్ ఏపీ యాప్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వంలో తప్పకుండా ఉద్యోగావకాశాలు కల్పిస్తామని భరోసానిచ్చారు. వార్డుల్లో డ్రైనేజీల సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు.అనంతరం మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ కర్నూలు నియోజకవర్గంలోని ప్రజలు సమర్పించిన వినతులను సంబంధిత అధికారులతో మాట్లాడి వీలైనంత త్వరగా పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి దాదాపు 9 నెలలు దాటిందని, కర్నూలులో ఉండే సమయంలో ప్రతిరోజు ఉదయం నుండి సాయంత్రం వరకు నియోజకవర్గంలోని ప్రజల నుండి వచ్చే వినతులను స్వీకరించి పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా ఈరోజు నూతనంగా “మీ సమస్య - మా పరిష్కారం” అనే కార్యక్రమం ద్వారా ప్రజల నుండి వినతులను స్వీకరించి అధికారుల సమక్షంలోనే సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్నప్పుడు రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, ఢిల్లీతో పాటు విదేశాలకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. అందుకే నియోజకవర్గ ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలన్న ఉద్దేశంతోనే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. అధికారులు ప్రజల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. ప్రజల సమస్యలు తీర్చేదే తమ ఎన్డీయే ప్రభుత్వం అని మంత్రి అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ సి.వెంకటనారాయణమ్మ, మున్సిపల్ కమిషనర్ రవీంద్రబాబు, ఆర్డీఓ సందీప్, టౌన్ డిఎస్పి బాబు ప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఈ నెల 30,31న రిజిస్టార్ కార్యాలయాలు పనిచేస్తాయ్



సబ్ రిజిష్టర్ శ్రీనివాసులు

**బనగానపల్లెరూరల్,న్యూస్:** ఈనెల 30,31వ తేదీల్లో సెలవు ఉన్నా రిజిష్టర్ కార్యాలయాలకు మాత్రం సెలవులు లేవని నిరంతరాయంగా సేవలను అందిస్తామని ఇంచార్జి సబ్ రిజిష్టార్ శ్రీనివాసులు తెలిపారు. బనగానపల్లె పట్టణం లోని సబ్ రిజిష్టార్ కార్యాలయం నందు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్థిక సంవత్సరం ముగింపును దృష్టిలో ఉంచుకొని ఈ నెల 30,31వ తేదీల్లో సెలవులు ఉన్నా కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతాయని రిజిస్ట్రేషన్లు చేయించుకోవలసిన వారు ఎవరైన ఉంటే ఈ విషయాన్ని గుర్తించి ఆయా తేదీల్లో రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని ప్రజలకు నిరంతరాయ సేవలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నామని సబ్ రిజిష్టర్ శ్రీనివాసులు తెలిపారు.

## పండుగ రోజుల్లో సైతం పన్నులు చెల్లించవచ్చు

**కర్నూలు నగరం, మేజర్‌న్యూస్ :** ఈ నెల 30,31వ తేదీల్లో ఉగాది,రంజాన్ పండుగ రోజుల్లో సైతం ఆస్తి,తాగునీటి కొళాయి పన్నులు ప్రజలు చెల్లించవచ్చని నగరపాలక అదనపు కమీషనర్ ఆర్‌జివి కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 31వ తేదీతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో ప్రజల సౌకర్యార్థం రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసు కున్నట్లు పేర్కొన్నారు. 50శాతం వడ్డీ రాయితీని అధిక సంఖ్యలో వినియోగించుకుంటున్నారని, సెలవు దినాల్లో సైతం పన్నులను చెల్లించవచ్చని సూచించారు. ఆది,సోమవారాల్లో ఉదయం 9గంటల నుండి రాత్రి 9గంటల వరకు నగరపాలక కార్యాలయంలో పన్ను వసూలు కేంద్రంతో పాటు నగరంలోని వివిధప్రాంతాల్లోఏర్పాటుచేసినప్రత్యేకకౌంటర్లలోసైతంపన్నులు చెల్లించవచ్చన్నారు.

# రైతుల పెట్టుబడి తగ్గాలి..తలసరి ఆదాయం పెరగాలి

(మొదటి పేజీ తరువాయి)

పాల్గొన్నారు. హార్టికల్చర్ అధికారి నాగరాజు, జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ, మార్క్‌ఫెడ్ డిడి హరినాథ్‌రెడ్డి, నాబార్డు డిడిఎం సుబ్బారెడ్డి, మహానంది హార్టికల్చర్ యూనివర్శిటీ శాస్త్రవేత్తలు డాక్టర్ ముత్యాలనాయుడు, కిషోర్‌కుమార్, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త బాలరాజు, ఐటీసీ సంస్థ మేనేజర్ విష్ణువర్ధన్, డిజిటల్ గ్రీన్ సంస్థ ప్రతినిధి వెంకట్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని దొర్నిపాడు, ఉయ్యాలవాడ, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల మండలాల్లో ఖరీఫ్ చివరిలో మూడు నెలలు మాత్రమే 2లక్షల ఎకరాల్లో శనగ పంట వేసి తరువాత 9నెలల సమయం అంతా బీడు భూములుగా వదిలేస్తున్నారని సంబంధిత భూముల్లో ఉద్యాన పంటలు వేసుకొనేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. సదరు మండలాల జీవన ప్రమాణాల కంటే ఇతర మండలాల తలసరి ఆదాయం ఎక్కువగా ఉంటోందన్నారు. దీంతో రైతాంగంతో పాటు జిల్లా అభివృద్ధికి నష్టం వస్తుందని సంబంధిత భూముల్లో ఉద్యాన వాణిజ్య పంటలు వేసుకొనేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో 43శాతం అభివృద్ధి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల ద్వారానే రంగాలపైనే ఆధారపడి ఉందని కలెక్టర్ తెలిపారు. సర్వీసు విభాగం నుంచి 39శాతం, పరిశ్రమల నుంచి 18శాతం అభివృద్ధికి దోహదపడుతున్నాయన్నారు. ప్రధానంగా ఉద్యానశాఖ నుండి రూ.7వేల కోట్లు, పపశుసంవర్ధక శాఖ నుంచి మరో రూ.7వేల కోట్లు, వ్యవసాయ శాఖ నుంచి రూ.3వేల కోట్లు, చేపల పపెంపకం ద్వారా రూ.వెయ్యి కోట్లు వెరసి మొత్తం రూ.17వేల కోట్లు జిల్లాకు గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్‌గా ఆదాయం వస్తుందని కలెక్టర్ తెలిపారు. రానున్న రోజుల్లో రూ.22వేల కోట్ల ఆదాయాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటూ రైతుల పెట్టుబడి తగ్గించి తలసరి ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉద్యానవన పంటలపరంగా మామిడి, మిరప, పండ్లు జిల్లా అభివృద్ధికి తోడ్పడుతున్నాయన్నారు. 5వేల ఎకరాల్లో మల్లె, ఐదువందల ఎకరాల్లో గులాబీ పంట వేయడం జరుగుతుందన్నారు. జిల్లాలో ఎకరాకు 26 మెట్రిక్ టన్నుల అరటి దిగుబడి ఉంటే అదే బంచ్ ప్రొటెక్షన్ చేయడం ద్వారా ఎకరాకు 40మెట్రిక్ టన్నుల దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో సుమారుగా 4.5లక్షల పశుసంపద ఉందని తద్వారా పాడి పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. భూములను ఖాళీగా ఉంచకుండా పశుగ్రాసాన్ని ఉత్పత్తి చేయాలన్నారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు, రిజర్వాయర్లలో చేపల పెంపకాన్ని ముమ్మరంగా చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

# వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా తుగ్గలి శ్రీనివాస్‌రెడ్డి



రైతువిభాగం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన శ్రీనివాసరెడ్డి

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :** మండల కేంద్రమైన తుగ్గలికి చెందిన పత్తికొండ మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ తమ్మారెడ్డి కుమారుడు తుగ్గలి శ్రీనివాస్‌రెడ్డిని వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వైసిపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ వైసిపి కేంద్ర కార్యాలయం నుండి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన వారికి పార్టీలో సముచితస్థానం కల్పిస్తుందన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీ కోసం ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలని ఆయన కోరారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు ఇప్పటినుండే పార్టీ నాయకులు,కార్యకర్తలు సైనికులుగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని ఆయన కోరారు. తనకు పార్టీ పదవి రావడం పట్ల మరింత బాధ్యతతో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తెలిపారు. తనకు పదవి ఇచ్చిన మాజీ సిఎం జగన్ మోహన్‌రెడ్డికి, పదవి రావడానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ, జిల్లా అధ్యక్షులు ఎస్వి మోహన్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్





**చాగలమర్రి, మేజర్ న్యూస్ :** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే గంగుల భీజేంద్రారెడ్డిలు అన్నారు. చాగలమర్రి పట్టణంలోని చక్రం కాంప్లెక్స్ వద్ద చక్రం సంస్థల అధినేత వ్యాపారవేత్త ముల్లా షబ్బీర్ అహమ్మద్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో వారు పాల్గొన్నారు.మౌలానా అబ్దుల్ మజీద్ ఆరీఫ్ ఆధ్వర్యంలోసామూహిక నమాజ్ చేసారు. అనంతరం ఉపవాస దీక్ష చేపట్టిన ముస్లింలకు ఫలహారాలు తినిపించి ఉపవాస దీక్ష విడిపించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇఫ్తార్ విందులలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. రంజాన్ మాస విశిష్టతను కొనియాడారు. అన్ని మతాలు చెప్పేది ఒక్కటేనని, మనషులంతా సోదర భావంతో ఉండాలన్నారు.ఎంపీపీ వీరభద్రుడు, వైసీపీ మైనారిటి సెల్ కార్యదర్శి బాబులాల్, ఉపసర్పంచ్ సోహెల్, వైసీపి నాయకులు పత్తి నారాయణ,మద్దూరు దస్తగిరి,చుండూరు వెంకట రమణ,గణేష్ రెడ్డి,వైస్ఎంపీపీ రఫి, ముల్లా ఖాదర్‌బాష, ఆర్ ఎస్‌రమణ,రఘురామ్,శేషురమేష్,సర్పంచ్ గోవిందయ్య, రహమాన్,చిన్నరాముదు,షబ్బీర్ అహమ్మద్, ఫయాజ్,ప్రచార కార్యదర్శి పెయింటర్ రఫి, బ్రాందీన్,సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

# జమ్ కేర్ కామినేని ఆసుపత్రిలో క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతం

**కర్నూలు రూరల్, మేజర్‌న్యూస్ :** నగరంలోని జమ్ కేర్ కామినేని ఆసుపత్రిలో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతంగా చేశామని ప్రముఖ ఆర్థోపెడిక్ డాక్టర్ రవిబాబు తెలిపారు. నంద్యాల జిల్లా గాజులపల్లికి చెందిన జయమ్మ అనే పేషెంట్‌కు గత ఏడాది జమ్ కేర్ కామినేని ఆసుపత్రిలో మోకాలు మార్పిడి చేశామని, ఆమెకు 6నెలల నుండి కీళ్ల నొప్పులు అధికమై చెయ్యి కూడా పైకి ఎత్తలేని పరిస్థితుల్లో ఆసుపత్రిలో చేరిందని ఆమెకు ఎమ్మారై, ఎక్స్‌రే అన్ని రకాల టెస్టులు చేసిన అనంతరం కుడి భుజం ఎముకలు పూర్తిగా అరిగిపోయినట్లు నిర్ధారణ కావడంతో ఈ వ్యాధిని ఆంకలోసిస్ అంటారని, దీనికి ఉత్తమ చికిత్స భుజం మార్పిడి చేయడమేనని,





భుజమార్పిడి చేయించుకున్న జయమ్మతో కామినేని ఆసుపత్రి బృందం

భుజం మార్పిడి ఆపరేషన్ చాలా క్లిష్టమైందన్నారు. ఈ ఆపరేషన్ ప్రముఖ నగరాలైన హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో మాత్రమే చేస్తున్నారని ఈ ఆపరేషన్ ఇప్పుడు కర్నూలు నగరంలో జమ్ కేర్ కామినేని ఆసుపత్రిలో చేశామని తెలిపారు. ఎటువంటి కీళ్లు, ఎముకల వ్యాధులకైనా జమ్ కేర్ ఆసుపత్రిలో అత్యుత్తమ చికిత్సలు, ఆపరేషన్లు చేస్తామన్నారు. జమ్ కేర్ కామినేని హాస్పిటల్‌లో క్లిష్టమైన భుజం మార్పిడి ఆపరేషన్ విజయవంతం చేసినందుకు వైద్యులు చంద్రశేఖర్, బాల మురలీకృష్ణ, రామమోహన్‌రెడ్డి, రాఘువేంద్ర, ఆదిత్య, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్స్ గణేష్, నదీమ్, కృష్ణవేణి, ఆపరేషన్ చేసిన డాక్టర్ రవిబాబుకు,సిబ్బందికి అభినందనలు తెలిపారు. డాక్టర్ రవిబాబు గురించి క్లుప్తంగా చెప్పాలంటేడాక్టర్‌రవిబాబుఎంబిబిఎస్,ఎంఎస్, కర్నూలు నగరంలోని మెడికల్ కాలేజీలో చదివారు. ఫెలో షిప్, స్పోర్ట్స్ ఇంజురీస్, ఆర్థో ప్లాస్టి బెంగళూరు, కేరళలో పూర్తి చేశారు. అబ్జర్వర్షిప్ జర్మనీ,సింగపూర్‌లో చేశారు. ఇప్పుడు కర్నూలు నగరంలోనిజమ్‌కేర్ కామి నేని ఆసుపత్రిలోఅత్యుత్తమసేవలు అందిస్తున్నారు.

## బస్సు కిందపడి వ్యక్తి మృతి

**జూపాడుబంగ్లా, మేజర్‌న్యూస్ :** మండలంలోని 80 బన్నూరు గ్రామ జంబులమ్మ ఆలయంసమీపంలో శుక్రవారం జరిగిన బస్సు, బైక్ ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వివరాల మేరకు ఆత్మకూరు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఏపీ39యుపి 7786 కింద పడి కొత్తపల్లి మండలం పాలెం గ్రామానికి చెందిన శివపురం నాగరాజు మృతి చెందాడు. నాగరాజు 80 బన్నూరులో ఓ శుభకార్యానికి బైక్‌పై వస్తుండగా ప్రమాదవశాత్తు ఎదురుగా వస్తున్న బస్సు ముందు టైర్ కిందపడి కుడి కాలు విరిగి తీవ్రగాయాల పాలయ్యాడు. చికిత్స కోసం ఆసుపత్రికి తరలిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం భాస్కర్‌నాయుడు



డోన్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** డోన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శీలం భాస్కర్‌నాయుడు ఘన విజయం సాధించారు. శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణంలో జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షుడిగా శీలం భాస్కర్‌నాయుడు, తమ సమీప ప్రత్యర్థి రంగారెడ్డిపై 159 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా కేజీ.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీగా రవిమోహన్, ట్రెజరర్‌గా మంగమూరి శ్రీనివాసులు, మహిళా ప్రతినిధిగా మీనిగ కుమారిలు ఇదివరకే ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అద్యక్షుడు శీలం భాస్కర్‌నాయుడు మాట్లాడుతూ తన విజయానికి కృషి చేసిన ప్రతి ఒక్క న్యాయవాదికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు తనవంతు కృషి చేస్తానని తెలియజేశారు.

## ఆది, సోమవారాల్లో రిజిష్టర్ ఆఫీసుల సేవలు

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ఆదేశానుసారం మార్చి 30 ఆదివారం, 31 సోమవారం రోజుల్లో సబ్ రిజిస్టర్ ఆఫీసులు అందుబాటులో ఉంటాయని ఆస్తుల క్రయ, విక్రయాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన వారు ఆది, సోమవారాల్లో యధావిధిగా సేవలు వినియోగించుకోవాల్సిందిగా బండిఆత్మకూరు సబ్ రిజిస్టర్ ఆదినారాయణ పేర్కొన్నారు. బండి ఆత్మకూరు సబ్ రిజిస్టర్ పరిధిలోని గ్రామాలకు సంబంధించిన క్రయ విక్రయదారులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

# దొంగలొస్తున్నారు జాగ్రత్త..!

**కొసిగి సిఐ మంజూనాథ్ వెల్లడి..**



**పెద్దకడుబూరు మేజర్ న్యూస్ :** కర్నాటక రాష్ట్రానికి చెందిన కొంతమంది పాత నేరస్తులు అనంతపురం జిల్లా. తెలంగాణ రాష్ట్రం గద్వాల జిల్లా వైపుగా అర్ధరాత్రి పూట పెట్రో బంకులకు వెళ్లి బంకుల వద్ద ఉన్న వ్యక్తులను బెదిరించి డబ్బులు గుంజు కొని వెల్లడం జరిగిందని అందువల్ల పెద్దకడుబూరు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కొస్గి సిఐ మంజూనాథ్ శుక్రవారం విలేకరులకు విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో తెలిపా రు. అలాగేఇదే గ్యాంగ్ గురువారం రాత్రి కర్నూలు జిల్లాలోనికి ప్రవేశించి మంత్రాలయం .మాధవరం పెద్ద తుంభళం. కోసిగి వైపుగా కూడా తెల్లటి బలోర ట్రాలీ వాహనంలో రావడం జరిగిందని తెలిపారు.అదే విధంగా ఈగ్యాంగ్ సభ్యులు పశువులసంతలకు ఇతర ప్రాంతాలకువెళ్ళివచ్చె వాహనాలను అడ్డుకోవడం వారి వద్ద ఉన్న డబ్బులను గుంజుకోని పరారవుతున్నాట్లు తనకు సమాచారం వచ్చిందని ఆయన తెలిపారు. అలాగే ఎవరైనా అనుమానుతులు కనిపిస్తే డయల్100. ఎస్ ఐ పెద్దకడు బూరు ఫోన్ నెంబర్ 9121101156.లేదా కోసిగి సిఐ 9121101154.నెంబరుకు ఫోన్ చేయాలని అయన తెలిపారు.

# సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ సేవలు

**కోవెలకుంట్ల, మేజర్‌న్యూస్ :** ఈ నెల 30,31వ తేదీల్లో ఉగాది, రంజాన్ పండుగ సెలవులు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్ సేవలు ఆ రెండు రోజులు కొనసాగుతాయని కోవెలకుంట్ల సబ్ రిజిస్టర్ శివకుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆర్థిక సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకుని ఈ నెల 30,31వ తేదీలలో సెలవులు ఉన్నా రిజిస్ట్రేషన్ చేసుకునే వినియోగదారులకు రిజిస్ట్రేషన్ సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

## నాటుసారా తయారీ నిర్మూలించాలి..





నెరణికి తాండ గ్రామస్థులతో సిఐ లలితాదేవి

**ఆలూరు, మేజర్‌న్యూస్ :** గ్రామాల్లో నాటుసారా తయారీని నిర్మూలించాలని ఆలూరు ఎక్సైజ్ సిఐ లలితాదేవి ,ఎస్సై నవీన్ కుమార్‌లు అన్నారు. శుక్రవారం ఆలూరు నియోజకవర్గంలోని నెరణికి, తాండా,అరికెర తాండా గ్రామాల్లో మహిళలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.అలాగే గ్రామ పెద్దలతో సమావేశం ఏర్పాటు చేసి నవోదయం 2.0లో భాగంగా ప్రజలు సారా బారిన పడి తమ కుటుంబాలను నాశనం చేసుకోవద్దని అన్నారు.నాటుసారా తయారు చేసినా, అమ్మినా నేరం అవుతుందని తెలిపారు.కార్యక్రమంలో పోలీసు సిబ్బంది విజయ్, సోమేష్ లు పాల్గొన్నారు.

# భార్యపై భర్త దాడి – భార్య మృతి



మృతి చెందిన లక్ష్మీదేవి

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** భార్యపై భర్త దాడి చేసి హత్య చేసిన ఘటన మండలంలోని మోత్కూరు మజారా గ్రామమైన తిమ్మనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు తిమ్మనపల్లె గ్రామానికి చెందిన మధు కృష్ణ అతని భార్య లక్ష్మీదేవి (35)పై శుక్రవారం మధ్యాహ్నం 1:30 గంటల ప్రాంతంలో గొడ్డలి కామాతో దాడి చేశాడు. తలపై కొట్టగా బలమైన గాయాలయ్యి తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే మృతి చెందింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై షాషా వలీ తెలిపారు.

# 7మందిపై బైండోవర్

**ఓర్వకల్లు, మేజర్‌న్యూస్ :** నవోదయ 2.0లో భాగంగా గతంలో ఉన్న కేసులపై ఏడుగురిని శుక్రవారం తహశీల్దార్ విద్యాసాగర్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ ఎస్ఐ రెహన్ బేగం తెలిపారు. మండల పరిధిలోని గుడుంబాయి తాండకు చెందిన నాటుసారా తయారీ విక్రయదారులను ఏడుమందిని తహశీల్దార్ ఎదుట హాజరు పరచగా తహశీల్దార్ వారితో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, వ్యవసాయం ఇతర వృత్తులను చేసుకుని జీవితంలో మార్పు తెచ్చుకోవాలని ఆరు నెలలలోపు అక్కడ చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో దొరికితే జైలు శిక్షతో పాటు రూ.1లక్ష జరిమానా విధించడం జరుగుతుందని తెలిపారు.

## వేలంపాటలో పెరిగిన ఆదాయం

**వెల్దుర్తి రూరల్ మేజర్ న్యూస్:** మండల కేంద్రమైన వెల్దుర్తి పట్టణంలోని వెల్దుర్తి మేజర్ గ్రామ పంచాయతీ వేలంపాటలో ఆదాయం పెరిగింది. శుక్రవారం మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ ముత్యాల శైలజ, జడ్పిటిసి దాది పోగు సుంకన్న, ఈ ఓ ఆర్ డి రవి కిషోర్ ,పంచాయతీ కార్యదర్శి కె .లక్ష్మీనాథ్, ఉప సర్పంచ్ శ్వేత ఆధ్వర్యంలో ఒక సంవత్సర కాలానికి నిర్వహించిన వేలాలలో వెల్దుర్తి పాత బస్టాండ్ లోని రామల్లకోట రోడ్డు లో ఉన్న మేజర్ గ్రామ పంచాయతీకి సంబంధించిన 8 షాపులకు గాను ఒక్కొక్క షాపుకు సంవత్సరానికి, 1,51,600లకు వేలంపాటదారులు దక్కించుకున్నారు.రెండుమాంసపు అంగళ్ళు ఒక్కొక్కటి రూ,13,500లకు వేలంపాటదారులు దక్కించుకున్నారు. జంతు వలశాల రూ,1,69,000లకు వేలంపాటదారులు దక్కించుకున్నారు. ఈ మూడింటిపై గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం రూ, 1,72,400 రూపాయల ఆదాయం పెరిగిందని తెలిపారు. మిగిలిన వారపు సంత మార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్ లోని రూములకు చిన్న మాంసపు అంగళ్లకు పాతాదారులు ముందుకు రాకపోవడంతో ఏప్రిల్ 1వ తేదీకి వాయిదా వేసినట్లు పంచాయతీ కార్యదర్శి కే లోకనాథ్ తెలిపారు.

సూర్య



## సర్వ లక్ష్మీ నరసింహ స్వామికి ఎమ్మెల్యే అఖిలప్రియ పూజలు



ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను ఆశీర్వదిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** గాజులపల్లె గిద్దలూరు రహదారిలో ఉన్న శ్రీ సర్వ లక్ష్మి నరసింహ స్వామిని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ శుక్రవా రందర్శించుకుని పూజలు చేశారు. ఆమె ఆలయానికి చేరుకోగానే ఆలయ అర్చకు లు, ఈవో బివి నరసయ్య లు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనం తరం సర్వ లక్ష్మి నరసింహ స్వామికి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే భూమా అఖిల ప్రియను అర్చకులు వేదమంత్రాలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ను అర్చకులు వేదమంత్రాలు ఆశీర్వ దించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట సిరివెళ్ల మండల కన్వీనర్ కాటంరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, మహదేవపురం, గుండంపాడు టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయం చేసే రైతు.. ముందు తరాలకు మార్గదర్శి

**-రైతు క్షేత్ర దినోత్సవంలో ఏఈ. మల్లేష్ కుమార్ వెల్లడి..**



**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** ప్రకృతి వ్యవసా యం చేసే రైతు రాబోయే తరాలకు మార్గ దర్శిగా చెప్పవచ్చని ఏఓ మల్లేష్ కుమార్ అన్నారు.మండల పరిధిలోని గుండ్రేవుల గ్రామంలో సుస్థిర వ్యవసాయ కేంద్రం కొండాపురం గ్రామ తుంగభద్ర సేంద్రియ రైతు ఉత్పత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో రైతు క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఓ. రైతులు ప్రకృతి వ్యవసాయం పై దృష్టి పెట్టాలని సూచించా రు.ఇంటి ఆవరణంలో పెరటి తోటలు, నావధాన్యల సాగు చేయాలనీ సూచించారు. అనం తరం సుస్థిర వ్యవసాయం కేద్రం సంస్థ అధికారి రవితేజ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసా యం చేసే రైతుల సక్సెస్ విజయగాథలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయంలోని పెట్టుబడుల తేడాలను వివరించారు. సుస్థిర వ్యవసాయం సంస్థ చేస్తున్న కార్యక్రమాలను సంస్థ అధికారి జనార్దన్ వివరించారు.ఈ కార్యక్రమంలో సుస్థిర వ్యవసా య సంస్థ, గుండ్రేవుల గ్రామ సర్పంచ్ భర్త శ్రీనివాస రెడ్డి,ఎంపీటీసీ చాంద్,వి ఏఏ. సోమేశ్వరి,ఎంపిఈఓ. వెంకటేశ్వర్లు, సిసిఏ, ఆర్ వైఎస్ఎస్ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

## పత్తికొండ మార్కెట్‌యార్డు ఛైర్మెన్‌గా ఆలంకొండ ఎస్.కె .నబీ సాహెబ్



**కృష్ణగిరి,మేజర్‌న్యూస్ :** పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌గా తనను నియమించడంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు పత్తికొండ ఎమ్మెల్యే కె.యి శ్యాంకుమార్‌కు కృతజ్ఞతలు తెలిపినట్లు టీడీపీ నాయకులు ఆలంకొండ ఎస్.కె.నబీ సాహెబ్ తెలిపారు.మండల పరిధిలోని ఆలంకొండ గ్రామానికి చెందిన ఎస్.కె.నబీ సాహెబ్ మాట్లాడుతూ నాయకులకు,కార్యకర్తలకు తగిన గుర్తింపు తోనే పార్టీ కోసం అహర్నిశలు శ్రమిస్తారని పేర్కొన్నారు.తన పైన నమ్మకంతో పత్తికొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మెన్‌గా తనను నియమించడంతో మార్కెట్ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు.అలాగే తనకు సహకరించిన పత్తికొండ తుగ్గలి,మద్దికెర వెల్దుర్తి మండలాల టీడీపీ నాయకులకు,కార్యకర్తలకు అభినందనలు తెలిపారు.

## జీవశాస్త్రం పరీక్షకు15 మంది విద్యార్థులు గైర్హాజరు



ఏపీ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రం వద్ద బారులు తీరిన విద్యార్థులు

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** మండలంలోశుక్రవారం నిర్వహించిన పదవతర గతి జీవశాస్త్రం పరీక్షకు మండల వ్యాప్తంగా పద హాయిదు మంది విద్యా ర్థులు గైర్హాజరయ్యా రు.రాబడిన సమాచా రం మేరకు మండలం లో నాలుగు పరీక్ష కేం ద్రాలు కొత్తకోట జిల్లా పరిషత్ ఉన్నతి పాఠశాల, బెళగల్ గురుకుల పాఠశాల,బెళగల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,ఏపీమోడల్ స్కూల్ కేంద్రాలలో నిర్వహించిన పదవతరగతి జీవశాస్త్రం పరీక్షకు పదహాయిదు మంది విద్యార్థులు గై హాజరయ్యారని సమాచారం.

## నోటితోనే దేహానికి ఆరోగ్యం



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** నోటి శుభ్రంగా ఉంచుకుంటేనే దేహానికి మంచి ఆరోగ్యం వస్తుందని డాక్టర్ రవళి తెలిపారు. శు క్రవారం ప్రపంచ నోటి ఆరోగ్య మాసోత్సవాల సందర్భంగా మండల పరిధిలోని పాఠశాలలు, ఆరోగ్య ఉపకేంద్రాలు, ఆసుపత్రి యందు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ దంత ధావన పద్ధతులు విద్యార్థులకు, రోగ స్రీలకు వివరించారు. ఈ అవగాహన కార్యక్రమాలు ఏప్రిల్ నెల 20వ తేది వరకు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగులకు బిసి కుటుంబం అండగా ఉంటుంది..

**ఉద్యోగులకు ఏ అవసరం వచ్చిన తమ కుటుంబం అండగా ఉంటుందన్న మంత్రి బి.సి**



మంత్రి బి.సి దంపతులను సత్కరిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** ఉద్యోగులకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా బి.సి కుటుంబం అండగా ఉంటుందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి తెలిపారు. బనగానపల్లె పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి బి.సి ఇంది రమ్మ దంపతులను వారు సన్మానించారు. విశ్రాంత ఉద్యోగు సర్వసభ్య సమావేశంలో ముఖ్య అతిధులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి బి.సి మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా ప్రభుత్వ ఉద్యోగులు రిటైర్డ్ ఉద్యోగుల సంక్షే మానికి కట్టుబడి పని చేస్తుందన్నారు. ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీ నజీతాలు,ఫించన్‌లుఅందజేయడం జరుగుతుందనివారు న్యాయపర మైన డిమాండ్‌లను కూడా ఒక్కొక్కటిగా నెరవేరుస్తామని తెలిపారు. 2005లో కీ.శే సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఫించన్‌ల సంఘం స్థాపించ గా నేడు అది మహావృక్షంగా మారి సభ్యులకు ఎవ్వరికి ఏ కష్టం వచ్చినా చేదోడు వాదోడుగా నిలబడటం ఆనందకరమన్నారు. ఆపదలో ఉన్న ఆయా కుటుంబాలకు మేమున్నామని అండగా నిలుస్తూ జిల్లాలోని మిగి లిన నియోజకవర్గాలకు ఈ సంఘం ఆదర్శప్రాయంగా నిలుస్తుందని వారు సంతోషం వ్యక్తం చేశారు. 2014లో తమ సోదరుడు బి.సి రాజా రెడ్డి ఈ సంఘానికి రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని ప్రతిపాదన తీసుకురా గా తాను ఇవ్వడం జరిగిందన్నారు. అక్కడ భవనం నిర్మించుకొని ఈ రోజు ఈ స్థాయికి చేరుకోవడం గొప్ప విషయమన్నారు. ఎవరికి ఏ కష్టం వచ్చిన తమ కుటుంబం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. పట్టణ అభివృద్ధి కోసం ప్రభుత్వ ఉద్యోగులు , రిటైర్డ్ ఉద్యోగుల సలహాలు, సూచనలుతీసుకొనిబనగానపల్లెనుఅభివృద్ధిపథంలో నడిపిస్తామన్నారు.

# మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్

**ఏపి స్టేట్ సీడ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి**



ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు వడ్డిస్తున్న ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి

**డోన్‌రూరల్, మేజర్‌న్యూస్:** పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరులకు ఏర్పాటు చేసే ఇఫ్తార్ విందు ఆత్మీయత, మత సామరస్యానికి ప్రతీక అని ఏపిఎస్ఎస్‌డిసిఎల్ ఛైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎంఎస్ఆర్ కార్యా లయంలో ముస్లిం సోదరులకు ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున పాల్గొన్న ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసి విందు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఆర్.ఈ.రాఘవేంద్ర, పట్టణ టిడిపి అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, నంద్యాల జిల్లా టిడిపి బీసిసెల్ అధ్యక్షుడు ప్రజావైద్యశాల బెస్త మల్లికార్జున, పట్టణ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఆలంకొండ మస్తాన్, టిడిపి పట్టణ బీసి సెల్ అధ్యక్షులు చక్రపాణిగౌడ్, అజీజ్ అహ్మద్, జలదుర్గం సలాం, ఎస్‌టి.గుల్షన్, శేఖర్‌గౌడ్, బోయ వీరాంజి, బిఎడ్.భాష, పార్థసారథిరెడ్డి(పార్థు), చనుగొండ్ల కాశీ, గుండాల జగన్, నీలం ప్రభాకర్, షాషాలు పాల్గొన్నారు.

## ప్రజలకు వరం..ముఖ్యమంత్రి సహాయనిధి..ఎమ్మెల్యే జయసూర్య

**పాములపాడు, మేజర్ న్యూస్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదల కు వరం లాంటిదని నందికొట్కూరు నియోజకవర్గ శాసనసభ్యులు గిత్త జయసూర్య అన్నారు. మండల పరిధిలోని లింగాల వేంపెంట మద్దూరు పాములపాడు గ్రామాలకు చెందిన వివిధ అనారోగ్యాల బారిన పడినవారికి ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు10,34,053 లక్షల చెక్కులను పంపిణీ చేశారు ఆపద లో ఉన్న ఎన్నో కుటుంబాలను సీఎం సహాయ నిధి ఆపద్భందు వునిగా అదుకుంటుందని ఆయన తెలిపారు. మానవతా దృక్పథం తో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికి ఆర్థిక సహాయాన్ని మంజూరు చేస్తున్నారని అన్నారు. బాధితులు అవసరమైన సమయంలో సీఎం రిలీఫ్ ఫండ్ ను



సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# త్రాగునీటి సమస్య రాకుండా గట్టి చర్యలు

**-గోనెగండ్ల, ఆలువాల ఎస్ఎస్ట్యాంక్లు, చెరువులు, కుంటలను నింపిన వైనం**

**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** ఈ ఏడాది వేసవిలో గోనెగండ్ల మండలంలోని 20 గ్రామ పంచాయతీలలో తాగునీటి సమస్య రాకుండా ఉండేందుకు గాను గట్టి చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో మణిమం జరి, ఈవోఆర్ అనంతశయన, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ హైమావతి, కార్యదర్శి సతీష్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగండ్లలోని ఎస్సీ కాలనీ, బీసీ కాలనీలలో వారు పర్యటించారు. ప్రజలను తాగునీటి ఇబ్బందులను గురించి తెలుసుకున్నారు. ఎన్ని రోజులకు నీరువస్తుందని ప్రజలను అడిగారు. ఇందుకు నాలుగురోజులకు ఒక్క సారి నీరు వస్తుందని అది కేవలం 45 నిమిషాలు మాత్రమే వస్తున్నామని ప్రజలు అధికారులకు వివరించా రు. ఈ సందర్భంగా వారు మాట్లాడ తూ మండలంలోని అన్ని గ్రామాలలో పర్యటిస్తామని తాగునీటి సమస్యతో పాటు మిగతా సమస్యలు కూడా అడిగి తెలుసుకుంటామని తెలిపారు. గ్రామాలలో నీటి సమస్య రాక గుండా గట్టి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అందులో బాగంగా పలు గ్రామాలలో ఉన్న నీటి కుంటలను, చెరువులను ఎల్లెల్సీ నీటితో నింపుతున్నామని దీంతో ఈ వేసవి కాలం లో గ్రామాలలో నీటి ఎద్దడి రాకుండా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎల్లెల్సీ కాలువ నుంచి గోనెగండ్ల, అలువాల సమ్మర్ స్టోరేజి ట్యాంక్లను నీటితో నింపివేశామ నిఆలాగే కులుమాల చెరువు, ఎర్రబాడులో రెండు చెరువులను, ఒంటెదుదిన్నె చెరువును, గోనెగండ్ల తూమ్మకుంట చెరువును నీటితో నింపివేశా మని అలాగే చిన్నమరివీడు చెర వును బుధవారం నింపనున్నట్లు ఆయన తెలిపారు. గంజహళ్లి, బైలుప్పల, ఆగ్రహారం గ్రామాలలో హంద్రీ నదిలో నీటి బోర్ల ద్వార గ్రామాలకు నీటి సరఫరా చేస్తాన్నా రు. అలాగే గ్రామాలలో వేసిన బోర్లను మర్మత్తు చేయించడం ద్వార కూడా గ్రామాలలో నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఈ ఏడాది వేసవిలో తాగునీటి సమస్య రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.



సూర్య



# మార్కెట్ యార్డ్ ఛైర్మెన్‌గా కురువ మల్లయ్య

**ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం**

**ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎమ్మెల్యే బీవీ**

**ఎమ్మిగనూరు టౌన్, మేజర్ న్యూస్ :** కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవుల్లో భాగంగా ఎమ్మిగనూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గా కురువ మల్లయ్య పేరును ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి ఇచ్చిన మాట ప్రకారమే కురువలకే చైర్మన్ పీఠాన్ని అందించారు. గత రెండు నెలలు కిందట జరిగిన కురువ వనభోజనం కార్యక్రమంలో ఎమ్మెల్యే బీవీ చైర్మన్ పీఠాన్ని కురువలకే ఇచ్చిన మాట ప్రకారం నిలబెట్టుకున్నారు. కురువ మల్లయ్య స్వగ్రామం ఎమ్మిగనూరు నియోజకవర్గం గోనెగండ్ల మండలం పెద్దమరివీడు గ్రామం. ఆయన ఎంపిక పట్ల పలువురు టీడీపి శ్రేణులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడుతూ ఈ అవకాశాన్ని కల్పించిన ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డికు రుణపడి ఉంటామని, నాపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వ్యవసాయం మార్కెట్ యార్డ్ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు.



ఎమ్మెల్యే బీవీతో మార్కెట్ చైర్మన్ కురువ మలయ్య

# ఎమ్మెల్యే బీవీకు కృతజ్ఞతలు తెలిపిన కురువ కార్పొరేషన్ ఛైర్మెన్

**ఎమ్మిగనూరు అర్బన్, మేజర్ న్యూస్:** ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని కురువ సామాజిక వర్గానికి కేటాయించినందుకు కురువ కార్పొరేషన్ చైర్మన్ ఎం.దేవేంద్రప్ప శుక్రవారం కర్నూలులో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ జయనాగేశ్వరరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కురవ కులస్తులకు చెందిన మల్లయ్యకు ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి రావడానికి ఎమ్మెల్యే బీవీ ఎంతో కృషి చేసినట్లు తెలిపారు. బీసీల అభివృద్ధికి సీఎం చంద్రబాబు అలాగే కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని పేర్కొన్నారు. వీరి వెంట కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు రామకృష్ణ, వెంకటరాముడు, ఉదయ్ తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బీవీని కలిసిన కురువ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప.

# గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



**గోనెగండ్ల, మేజర్ న్యూస్ :** గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మహిళలు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని ఉమెన్ ఫ్రెండ్లీ రాష్ట్ర పరిశీలకుడు నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన గోనెగం డ్లలోని పంచాయతీ భవనం నందు వీఓఏ లకు అవగాహన సదస్సునిర్వహించారు. ఉమెన్ ఫ్రెండ్లీ రాష్ట్ర పరిశీలకుడు నాగేశ్వరరావు మాట్లాడుతూ గోనెగండ్ల మేజర్ పంచా యతీ ఉమెన్ ఫ్రెండ్లీ గ్రామంగా ఎంపికైందన్నారు. ఈ గ్రామంలో మహిళలు ఏ విధంగా ఆర్థికంగా ఎదగాలి. ఎలా బలపడాలి అనే అంశాల పైన ఆయన మాట్లాడారు. పొదుపు మహిళలకు బ్యాంక్ లింకేజి, స్త్రీనిధి, ఉన్నతి, సీఐఫోరుణాలు ఇచ్చి మహిళలను ఆర్థికం గా బలపడే విదంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు అందజే స్తుందని తెలిపారు. ఈ రుణాలను మహిళలు సద్వినియోగం చేసు కోవాలన్నారు. వీఓఏలు మల్లేశ్వరి, సుజాత, శైలజా, జరినాబే గం, బోయ మునిస్వామి, కాజబంద శ్రీను, కటికే మాబాషా, అక్బర్, పాల్గొన్నారు..

# వైఎస్సార్సిపి పార్టీ బలోపేతానికి కృషి చేస్తాం

**పత్తికొండ, మేజర్ న్యూస్ :** వైఎస్సార్సిపి పార్టీ బలోపేతానికి కృషి చేసి పార్టీ పటిష్టతకు కార్యకర్తలకు అండగా ఉండి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తామని రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త హోసూరు బనగాని శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పత్తికొండ పట్టణంలోని వైఎస్సార్సిపి పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ కారం నాగరాజు యాదవ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కమిటీలలో పదవులు అలంకరించిన రాష్ట్ర బూత్ కమిటీ సంయుక్త కార్యదర్శిగా నియామకమైన హోసూరు బనగాని శ్రీనివాసులును ఎంపిపి నారాయణ దాసు, హోసూరు గ్రామ నాయకులు శాలువలు, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, వైసీపీ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని, పార్టీ కీలక బాధ్యతలు ఇచ్చిన మాజీ సీఎం జగన్‌రెడ్డికి, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మకు కృత జ్ఞతలు తెలిపారు. మండల ఎంపిపి నారాయణ దాసు, శ్రీనివాసులు, ఎంపిటీ సీ కేశప్ప, హోసూరు సర్పంచ్ నాగప్ప, నాగిరెడ్డి, పందికోన రవి కుమార్, పెద్ద హుల్తి నాగరాజు, భాస్కర్ నాయక్, రంగానాయక్, శాంతిరెడ్డి, రంగన్న, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే అఖిలప్రియను కలిసిన చాగలమర్రి ఎస్సై



ఎమ్మెల్యేను మర్యాదపూర్వక కలిసిన దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దంపతులను చాగలమర్రి ఎస్సై సురేష్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన ఎస్సైగా చాగలమర్రి మండలానికి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఎమ్మెల్యే దంపతులను మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ దంపతులకు మొక్క ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రజలందరితో ఫ్రెండ్లీ పోలీస్‌గా ఉండాలని ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ ఎస్ఐకి సూచించారు.

# విద్యార్థినీలు ఫోక్సో యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలి

**కల్లూరు, మేజర్‌న్యూస్ :** విద్యార్థినీలు ఫోక్సో యాక్ట్‌పై అవగాహన కలిగి ఉండాలని మహిళా కోర్టు జిల్లా జడ్జి వి లక్ష్మి రాజ్యం అన్నారు. శుక్రవారం న్యాయ సేవాధికార సంస్థ ఆద్వర్యంలో పర్ల గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేసి ఫోక్సో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జడ్జి వి లక్ష్మిరాజ్యం మాట్లాడుతూ ఎవరైనా 18ఏళ్లలోపు పిల్లలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయన్నారు. లైంగిక నేరాల నుండి రక్షణ చట్టం 2012ప్రకారం పిల్లలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు కలవన్నారు. పిల్లలు లైంగిక వేధింపులకు పాల్పడకుండ ఈ ఫోక్సో యాక్ట్ ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ ఫోక్సో కేసులను త్వరితగ తిన పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టు కలదని తెలిపారు. పిల్లలకు ఏదైన సమస్య వస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి చెప్పవచ్చున్నారు. ఈ సదస్సులో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జమీలా, ఇంచార్జ్ హెడ్‌మాస్టర్ మనోహర్‌రెడ్డి, టీచర్స్ భీమసేన, నాగమణి, రమాదేవి,సుషిల బాయి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి వి లక్ష్మిరాజ్యం

# వైసీపీ రైతు విభాగం అధికార ప్రతినిధిగా గడ్డం నారాయణ రెడ్డి



సన్మానం చేస్తున్న నాయకులు

**ఎమ్మిగనూరు ప్రతినిధి, మేజర్ న్యూస్ :** వైస్సార్సీపీ రాష్ట్ర రైతు విభాగం అధికార ప్రతినిధిగా కె. గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డి నియమకం పట్ల హోలహర్వి, పట్టణ వైసీపీ నాయకులు ఆయనకు ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా గడ్డం మాట్లాడుతూ నియోజకవర్గం ఇంచార్జి బుట్టా రేణుక ఆధ్వర్యంలో నియోజకవర్గంలో వైస్సార్సీపీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

# షిరిడీసాయిబాబ సేవలో బి.సి రాజారెడ్డి

**బనగానపల్లెమేజర్,న్యూస్ః**

బనగానపల్లె మండల పరిధిలోని యాగంటిపల్లె గ్రామ సమీపంలో వెలిసిన శ్రీ శిరిడీసాయిబాబ ఆలయంలో వెలిసిన బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బి.సి రాజారెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. శుక్రవారం ఉదయం సాయిబాబను ద ర్శించుకొని పూజలు నిర్వహించారు. శిరిడీసాయిబాబ మందిరం 16వ వార్షికోత్సవం సద్గురు సాయి 124 అడుగుల సాయిబాబా వారి దివ్యమూర్తి నాల్గవ వార్షికోత్సవ సందర్భంగా ఆలయంలో పవిత్రోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ నెల 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు స్వామి వారికి ప్రత్యేక పూజలు హోమాలు నిర్వహించడం జరుగుతుంది.



బాబా వారిని దర్శించుకుంటున్న బి.సి రాజారెడ్డి

# ఆంధ్రప్రదేశ్ లో 18వ అవుట్ లెట్ నంద్యాల మలబార్ షో రూం

**మలబార్ బంగారు మరియు వజ్రాభరణాల షో రూంను ప్రారంభించిన మంత్రి ఫరూక్**

**వినియోగదారులు కొనుగోలు చేసిన బంగారం బరువుకు సరిసమానమైన వెండి నాణెం ఉచితం**

**ప్రజలకు నాణ్యమైన వ్యాపార సేవలందించడంతోపాటు పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నాం**

**మలబార్ గ్రూప్ ఛైర్మెన్ ఎంపీ అహ్మద్**

**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** పట్టణంలోని శ్రీనివాస్ నగర్‌లోఉన్న మెడిసేవా డయాగ్నోస్టిక్స్ సర్వీసెస్ ప్రక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ప్రపంచంలోని అతిపెద్ద బంగారు మరియు వజ్రాభరణాల సంస్థలలో ఒకటిగా నిలిచిన ప్రముఖ వ్యాపార సంస్థ మలబార్ బంగారు మరియు వజ్రాభరణాల షోరూంను మంత్రి ఫరూక్ శుక్రవారంప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ప్రపంచంలోని అతిపెద్ద బంగారు మరియు వజ్రాభరణాల సంస్థలలో ఒకటిగా నిలిచిన ప్రముఖ వ్యాపార సంస్థ మలబార్ బంగారు మరియు వజ్రాభరణాల షోరూంను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. 3,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ కొత్త షోరూమ్, విభిన్న డిజైన్లు మరియు శైలులతో తయారుచేసిన అద్భుతమైన ఆభరణాల సేకరణలను అందిస్తూ, వినియోగదారులకు అంతర్జాతీయస్థాయి షాపింగ్ అనుభూతిని అందిస్తుందన్నారు. ఏప్రిల్6 వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు అందిస్తుందని , వినియోగదారులు కొనుగోలు చేసిన ప్రతి కొనుగోలుపై, బంగారం బరువుకు సరిసమానమైన వెండి నాణెం ఉచితంగా అందుకుంటారన్నారు భారతదేశంలో తమ ఉనికిని మరింత విస్తరించాలనే మలబార్ ప్రణాళికలకు అనుగుణంగా ప్రారంభించబడిన ఈ కొత్త షోరూమ్, తమ ప్రస్థానంలో మరొక ముందడుగును వేసిందన్నారు. నంద్యాలలో ప్రారంభించిన ఈ షోరూమ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మలబార్ బ్రాండ్ యొక్క 18 వ అవుట్లెట్, మరియు ఈ ప్రాంతంలో మలబార్ ఉనికిని మరియు నాయకత్వాన్ని మరింత బలోపేతం చేస్తుందనే మంత్రి ఫరూక్ తెలిపారు. అనంతరం వినియోగదారులు కొనుగోలు చేసిన బంగారు ఆభరణాలను మంత్రి ఫరూక్ చేతుల మీదుగా కొనుగోలుదారులకు అందించడం జరిగింది. 1993 సంవత్సరం లో స్థాపించిన మలబార్ బంగారు మరియు వజ్రాభరణాల సంస్థ 6.2 బిలియన్ వార్షిక టర్నోవరు తో ప్రపంచం లోనే 6వ అతిపెద్ద ఆభరణాల రిటైలర్ గా మలబార్ ప్రఖ్యాతి గాచిందని, మొత్తం 13 దేశాలలో 380 షో రూం లు మలబార్ బ్రాండ్ నిర్వహిస్తోందని ప్రజలకు నాణ్యమైన వ్యాపార సేవలందించడంతోపాటు పేదల అభ్యున్నతికి ఖర్చు చేస్తున్నామని సంస్థ నిర్వాహకులు అహ్మద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు ఎన్ఎండి ఫయాజ్ , మేనేజ్మెంట్ అండ్ టీమ్ సభ్యులు, సిరాజ్ పికె , రిటైల్ హెడ్ రెస్ట్ అఫ్ ఇండియా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిఖిల్ చంద్రన్ , ఆంధ్రప్రదేశ్ జోనల్ హెడ్ మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఫయిజ్ , మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ కర్నూల్ షోరూం హెడ్ మాయిాజ్, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నంద్యాల షోరూం హెడ్ వినియోగదారులు మరియు శ్రేయోభిలాషులు ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# సమాజంలో పేదలకు అండగా ఉండేందుకే పీ -4

(మొదటిపేజి తరువాయి..)

మార్చి25వ తేది వరకు సర్వే ను నిర్వహించామన్నారు. ఈ సర్వేలో ప్రతి గ్రామంలో గ్రామ సభలు నిర్వహించి అత్యంత పేదరికంలో ఉన్న 20 శాతం మందిని గుర్తించామన్నారు.పీ4 విధానంలో భాగంగా పేదరిక నిర్మూలనకువీలుగా10 సూత్రాలను అనుసరిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జీరో పావర్టీ, ఉపాధి, మానవ వనరుల అభివృద్ధి, నైపుణ్యం,ప్రతి కుటుంబానికి నీరు ఇవ్వడం, రైతు-వ్యవసాయ సాంకేతికత, గ్లోబల్ బెస్ట్ లాజిస్టిక్స్, ఇంధనాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవడం, ప్రాడక్ట్ పర్ఫెక్షన్, స్వచ్ఛ ఆంధ్ర తదితర సూత్రాల అమలు ద్వారా పీ4 విధానం అమలు అవుతోందన్నారు. పేదలకు అండగా నిలవాలనుకునే దాతలు, పారిశ్రామిక వేత్తలు, స్వచ్ఛంద సంస్థలు ఈ కార్యక్రమం లో భాగస్వాములు అయి, తగిన సహకారం అందచేయవచ్చని కలెక్టర్ తెలిపారు.. అండగా నిలబడే వారిని మార్గదర్శిగా పేర్కొంటూ, పేద కుటుంబాలను బంగారు


సమీక్షలో పాల్గొన్న అధికారులు

కుటుంబాలుగా మార్గదర్శి తోడ్పడతారని కలెక్టర్ పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి క్యూ ఆర్ కోడ్ ఉందని, తద్వారా మీ అభిప్రాయాలు తెలియచేయవచ్చని కలెక్టర్ సూచించారు.పాణ్యం ఎంఎల్ఏ గౌరు చరిత మాట్లాడుతూ రాష్ట్రాన్ని పేదరికం లేని రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు.. ప్రభుత్వము అధికారంలోకి వచ్చినప్పటి నుండి కూడా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.. పెన్షన్ల పెంపు, అన్న క్యాంటీన్ల ఏర్పాటు, దీపం పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. మిగిలిన కార్యక్రమాలు అమలు దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే తెలిపారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలని, అట్టడుగున ఉన్న వారిని పైకి తీసుకొని రావాలన్న ఉద్దేశంతోనే పీ- 4 కార్యక్రమాన్ని ఉగాది రోజున ప్రారంభించుకుంటున్నామన్నారు. పేద కుటుంబాలను బంగారు కుటుంబాలుగా మార్చేందుకు మార్గదర్శకులుగా ముందుకు రావాలని, పి4 విధానంలో భాగస్వాములై సహాయ సహకారాలు అందజేయాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు.ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి మాట్లాడుతూ వికసిత్ భారత్-స్వర్ణాంధ్ర 2047లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పీ4 విధానాన్ని అమలు చేస్తోందని తెలిపారు..రాష్ట్రంలో స్థిరమైన అభివృద్ధి సాధించే దిశగా లక్ష్యాలను రూపొందించుకుని, ప్రభుత్వం పేదరిక నిర్మూలన కోసం కృషి చేస్తోందన్నారు. జిల్లాలో పశ్చిమ ప్రాంతం పూర్తిగా వెనుకబడి ఉందని, ఈ ప్రాంతంలో పేదరిక నిర్మూలన కు అత్యున్నత వర్గాలు మార్గదర్శకులుగా ముందుకు వచ్చి తగిన సహకారం అందచేయాలని ఎమ్మెల్యే సూచించారు.పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ పీ4 విధానం ముఖ్యమంత్రి కి ఇష్టమైన అంశమని తెలిపారు..జిల్లాలో పెన్షన్ పంపిణీ లో ముందు ఉన్నామని, అలాగే ఈ కార్యక్రమంలో కూడా ముందు ఉండి పేదరిక నిర్మూలనకు ముందుకు రావాలని, ఇందుకోసం తమ వంతు సహకారాన్ని కూడా అందచేస్తామని ఎమ్మెల్యే తెలిపారు.సమావేశంలో పీ 4 విధానం అమలుకు సంబంధించి పలువురు పరిశ్రమల ప్రతినిధులు తమ అభిప్రాయాలను తెలియచేశారు. సమావేశంలో సిపిఓ హిమ ప్రభాకర్ రాజు, జిల్లా అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

**- ఎన్.ఎఫ్.ఎ.బి రామకృష్ణ**



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**దొర్నిపాడుమేజర్,న్యూస్ః** రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ విభాగ ఎన్.ఎఫ్.ఎ.బి రామకృష్ణ సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన దొర్నిపాడు వెలుగు కార్యాలయం నందు ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కరీఫ్ 2025 ప్రణాళికపై వ్యవసాయ శాఖ వెలుగు సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రస్తుత వ్యవసాయంలో ఎక్కువగా రసాయనిక ఎరువులు మరియు పురుగు మందులు వినియోగిస్తున్నారని తద్వార ఆహార ధాన్యాలు , కూరగాయలు మరియు భూమి కలుషితం అవడం వలన మానవాళి ఆరోగ్యం దెబ్బతింటుందని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయం వైపు రైతులను మరల్చడానికి ఎంతో చేస్తుందని ఆయన అన్నారు. అనంతరం మండల వ్యవసాయ అధికారి ప్రమీళ మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల తగ్గించి ప్రకృతి సేద్యం వైపు రావాలని ప్రకృతి సేద్యం ద్వార తక్కువ ఖర్చుతో రసాయన రహిత అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది అందరూ కూడా కరీఫ్ కార్యచరణ ప్రణాళికలో పాల్గొని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సహకారం అందించాలని ఆమె తెలిపారు. అనంతరం డి.ఆర్.డి.ఎ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ బాబు మాట్లాడుతూ ప్రతి మహిళ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని అలాగే ప్రతి భూమి లేని నిరుపేద మహిళలు 365రోజులు పెరటి తోటలు వేసుకోవాలని ఆమె తెలిపారు. కరీఫ్ కార్యాచరణ ప్రణాళికలో డి.ఆర్.డి.ఎ సిబ్బంది బాధ్యత తీసుకొని ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సహకారం అందించాలని ఆయన కోరారు. వ్యవసాయ శాఖ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతు సేవా కేంద్రం సిబ్బంది మరియు వెలుగు వి.ఒ.ఎలు సమిష్టిగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించి కరీఫ్ 2025 ప్రణాళికను సిద్ధం చేయాలని ఎక్కువ మంది రైతులు అధిక విస్తీర్ణంలో ప్రకృతి వ్యవసాయం చేసే విధంగా అవగాహన కల్పించి అంతర పంటలు వేయడం వలన కలిగే ఉపయోగాలు ఎటిఎం పద్ధతిలో కూరగాయలు సాగు చేసే విధానం పి.ఎం.పి.ఎస్ పద్ధతిలో 365 రోజులు భూమిని కప్పి ఉంచే విధానం నవధాన్యాలు సాగు చేస్తాం ప్రాముఖ్యత గురించి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది (కమ్యూనిటీ రీసోర్స్ పర్సన్), వ్యవసాయ శాఖ సిబ్బంది , డి.ఆర్.డి.ఎ క్లస్టర్ కోఆర్డినేటర్‌లు, గ్రామ వ్యవసాయ సహాయకులు, స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

# మద్యం తాగడంలో ఫుల్-చదువుకోవడంలో నిల్

- **మద్యం తాగడంలో కోసిగికి మొదటిస్థానం**
- **నాటుసారా రహిత జిల్లా చేసేందుకు కృషి**
- **అక్రమ కర్ణాటక మద్యం తగ్గుముఖం**
- **జిల్లా ఎక్సైంజ్ సూపరిటెండెంట్ సుధీర్‌బాబు**

**కోసిగి మేజర్ న్యూస్:** ప్రతి మండలం అభివృద్ధిలోను, చదువుకోవడంలోను, వ్యవసాయంలోను ఇలా వివిధ రకాల వాటిలో మొదటి స్థానానికి ప్రయత్నించే మండలాలున్నాయి కాని.. కోసిగి మండలం మాత్రం వాటికి వ్యతిరేకంగా మద్యానికి బానిసై మద్యం త్రాగడంలో మొదటిస్థానంను, చదువుకోవడంలో చివరిస్థానంలోనే కొనసాగుతుంది కోసిగి మండలం. దానికి ఉదాహరణే ఈ సంవత్సరం మద్యం తాగడంలో మొదటిస్థానంలో నిలిచింది. శుక్రవారం జిల్లా ఎక్సైంజ్ సూపరిటెండెంట్ అధికారి సుధీర్‌బాబు కోసిగి ఎక్సైంజ్ స్టేషన్‌ను తనిఖీచేశారు. ఈసందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ నవోదయ 2.0 కార్యక్రమంలో భాగంగా కోసిగి ఎక్సైంజ్ స్టేషన్‌ను పరిశీలించామన్నారు. జిల్లాలో 110 నాటుసారా గ్రామాలుగా గుర్తించామన్నారు. వాటిలో 36కేసులు నమోదుచేశామని 76మందిని అరెస్టుచేసి తహశీల్దార్ ముందు హాజురు పరిచి నోటీసులు జారీచేయడం జరిగిందన్నారు. నాటుసారా అరికట్టేందుకు మా శాఖ పూర్తిగా పనిచేయాలని అధికారులకు ఆదేశించారు. అలాగే కోసిగి మండలంలో మూడు మద్యం దుకాణాలు ఉన్నాయని మద్యం సరఫరాలోను, త్రాగడంలోను కోసిగి మొదటిస్థానంలో ఉందన్నారు. ఈ మద్యంషాపులవల్ల అక్రమ కర్ణాటక మద్యం దాదాపుగా తగ్గుముఖం పట్టిందన్నారు. ఎవరైనా నాటుసారాను తయారుచేస్తే జరిమానా విధించి జైలుశిక్ష తప్పదన్నారు. త్వరలో నాటుసారా రహిత జిల్లాగా చేసేందుకు తమవంతు కృషిచేస్తామన్నారు. కోసిగి ఎక్సైంజ్ సిఐ భార్గవరెడ్డి, సిఐ రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

# గజ్జహళ్లిలో గ్యాస్ లీక్‌తో ఇల్లు దగ్ధం

**★ రూ. 2 లక్షల నష్టం**

**హొళగుంద,మేజర్‌న్యూస్ః** హొళగుంద మండలం గజ్జహళ్లి గ్రామంలో శుక్రవారం బాష ఇంట్లో గ్యాస్ లీక్ కావంతో ఇల్లు దగ్ధం అయింది.గ్రామంలో బాష హోటల్‌ను నిర్వహిస్తున్నాడు.వంటలను చేస్తుండగా గ్యాస్ ఫైఫ్ లీక్ కావండంతో ఆతాత్తుగా మంటలు పెద్దగా వ్యాపించడంతో ఇంటికి నిప్పు అంటుకుంది.చుట్టు పక్కన వారి సహయంతో నీళ్ళుపోసి మంటలను ఆర్పారు.ప్రమాదంలో ప్రాణ హానీ జరగలేదు.అగ్ని ప్రమాదంలో ఇంటి వాకిలి,టివి,సామాగి దుస్తులు,నగదు కాలిపోయాయని ఘటన స్థలాన్ని పరిశీలించిన విఆర్ఒ ప్రహ్లాద్,గ్రామ కార్యదర్శి రంగస్వామికి బాధితుడు తెలిపారు.రూ. 2 లక్షల వరకు నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రభుత్వం నుండి వెంటనే ఆర్థిక సహాయం కల్పించాలని బాధితుడు బాష కోరుతున్నారు.



## డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా - జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** జిల్లాలో నేరాలను నియంత్రించే చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా నేరాలు జరిగేందుకు ఆస్కారం ఉన్న మారుమూల ప్రాంతాలను ముందుగా గుర్తించి,ఆయా ప్రాంతాలపై నిఘా పెట్టేందుకు డ్రోన్లను వినియోగిస్తున్నామని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. పెట్రోల్ బంకుల దగ్గర జరుగుతున్న నేరాలపై ముమ్మరంగా దర్యాప్తులు చేపట్టాలని జిల్లా ఎస్పీ పోలీసు అధికారులకు శుక్రవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సబ్ డివిజన్‌ల వారిగా డ్రోన్ కెమెరాలను పంపి పెట్రోల్ బంకుల వద్ద నిఘా పటిష్టం చేశారని, సాంకేతిక పరిజానాన్ని వినియోగించి, నేరాల కట్టడికి చర్యలు చేపడుతున్నట్లు ఎస్పీ తెలిపారు. కావున ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో పెట్రోల్ బంకుల దగ్గర జరుగుతున్న నేరాల గురించి ఆరా తీస్తున్నారన్నారు. దొంగతనాలు, ఇతర నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న శివారు ప్రాంతాలను నిశిత ప్రాంతాలను బహిరంగ ప్రదేశాలను ముందుగా గుర్తించి ఆయా ప్రాంతాలైన డ్రోన్స్ పంపి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## నేడు సర్వేసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో

**మిడుతూరు మేజర్ న్యూస్ :** మండల కేంద్రమైన మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి దశరథ రామయ్య పత్రికా పత్రికలతో ప్రకటనలో తెలిపారు. శనివారంఉదయం 10:30 గంటలకు మండల పరిషత్ అధ్యక్షులు మరియు జెడ్పిటిసి అధ్యక్షతన నిర్వహించబోయే ఈ మండల సమావేశానికి ఆయా గ్రామాల సర్పంచులు ఎంపీటీసీలతో పాటు అన్ని శాఖల అధికారులు హాజరు అవ్వాలని ఆయన కోరారు.

## వీఆర్ఓ పై దాడి..పోలీస్ స్టేషన్ లో పిర్యాదు


పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేస్తున్న వీఆర్ఓ. బి.వెంకటేష్

**సి.బెళగల్ మేజర్ న్యూస్ :** సి. బెళగల్ గ్రామ రెవిన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్న బి. వెంకటేష్ పై స్థానిక సి.బి.ఆదిత్యరెడ్డి దాడి చేసినట్టు సమాచారం.రాబడిన సమాచారం మేరకు సి.బి. ఆదిత్య రెడ్డికి సంబందించిన వ్యవసాయ భూమి మిగులు భూమిగా రెవిన్యూ రికార్డులో నమోదు కాబడిందని సమాచారం. ఈ మిగులు భూమి వ్యవహారంలో తలెత్తిన గొడవలో వీఆర్ఓ వెంకటేష్ పై సి.బి. ఆదిత్య రెడ్డి దాడి చేసినట్టు సమాచారం. దాడి జరిగిన వెంటనే దాడి చేసిన వ్యక్తిపై స్థానిక పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయడం జరిగింది.

## ఉర్దూ పాఠశాల భవనాలకు స్థలం కేటాయించండి

**- కౌన్సిలర్ వెల్లాల లలితమ్మ, ఉషారాణి**

**ఆదోని, మేజర్ న్యూస్ :** ఆదోని మున్సిపాలిటీ పరిధిలోని భీంరెడ్డి కాలనీ ఉర్దూ పాఠశాలకు భవనం లేకపోవడం చేత కమ్యూనిటీ హాలులో తాత్కాలిక పాఠశాల నాలుగు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారని కౌన్సిలర్ లలితమ్మ, బిజెపి సౌత్ జోన్ మహిళా అధ్యక్షురాలు ఉషారాణిలు పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యకు పెద్దపీఠ వేస్తూ, అవసరమైన చోట నూతన స్కూలు భవనాలను నిర్మించాలని సంకల్పించారు. భీంరెడ్డి కాలనీలో కూడ మున్సిపాలిటీ అధీనంలో ఖాళీ స్థలాలు చాలా ఉన్నాయి. అనంతరం ఉర్దూ పాఠశాల నిర్మించడానికి మున్సిపల్ కమీషనర్ స్థలం కేటాయించాలని కోరుతూ, వారు మున్సిపల్ కమీషనర్‌కు వినతిపత్రం అందజేశారు.మస్తాన్ వలి, మహబూబ్ బాష, మస్తాన్ లాల్, బాషా, ఫారూఖ్, అన్వర్ బాషా, అల్లా బకాష్, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష పై అవగాహన

**-క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష , సి వై - టీబీ చర్మ పరీక్షలు ప్రారంచిన అధికారులు**



**నంద్యాల టౌన్ మేజర్ న్యూస్ :** జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఎన్ జి ఓ కాలనీ లోని అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ లో క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష , సి వై - టీబీ చర్మ పరీక్ష (క్షయ సోకిన రోగితోపాటు నివసించే వ్యక్తులకి చేయు పరీక్షలను శుక్ర వారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఆర్. వెంకట రమణ, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎం. శారదా బాయి ప్రారంభించారు. ఈ సందర్బంగా డాక్టర్ వెంకట రమణ మాట్లాడుతూ క్షయ వ్యాధి సంక్రమణ పరీక్ష , సి వై - టీబీ చర్మ పరీక్ష ( క్షయ సోకిన రోగి తో పాటు నివసించే వ్యక్తులకి చేయు పరీక్ష ) ప్రారంభించామని ఈ పరీక్ష గురించి అవగాహన , క్షేత్రస్థాయి లో ఈ పరీక్ష ని సమర్ధవంతగా అమలు ఆయ్యేవిధంగా చూడాలని ఆదేశించారు, ఈ కార్యక్రమము లో జిల్లా క్షయ వ్యాధి నివారణ అధికారిణి డాక్టర్ శారదాబాయి మాట్లాడుతూ క్షయ వ్యాధిని ని నిర్మూలించే కార్యక్రమంలో భాగంగా భారత ప్రభుత్వం వారు ప్రవేశపెట్టిన ఈ పరీక్ష చాల ఉపయోగపడుతుంది అని తెలిపారు. ఈ పరీక్షలో సంక్రమణ నిర్ధారణ అయితే టీబీ జబ్బు రాకుండ ముందస్తుగా వాడే మందులని ప్రభుత్వం ఉచితంగా ఇస్తుంది అని తెలియచేసారు. సివై- టీబి పరీక్ష కిట్స్ జిల్లాలోని అన్నీ సామాజిక మరియు ప్రాధమిక ఆరోగ్య కేంద్రాలలోఉచితంగా వేయడం జరుగుతుందన్నారు. ప్రోగ్రాం ఆఫీసర్లు,టీబి మెడికల్ ఆఫీసుర్లు,ఎన్టిఈ బి సిబ్బంది,వైద్యసిబ్బంది, ఏ ఎన్ ఎం లు, ఆశ వర్కర్ లు పాల్గొన్నారు.

# ఆళ్లగడ్డ బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా సీ.శివరామిరెడ్డి



శివరామిరెడ్డికి మిఠాయి తినిపిస్తున్న దృశ్యం

**ఆళ్లగడ్డ, మేజర్ న్యూస్ :** ఆళ్లగడ్డ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది చింతకుంట శివరామిరెడ్డి విజయం సాధించారు. శుక్రవారం బార్ అసోసియేషన్‌కు జరిగిన ఎన్నికల్లో ఆయన తనసమీప ప్రత్యర్థి పత్తి సుబ్బారామిరెడ్డి పై 91 ఓట్ల భారీ మెజారిటీతో గెలుపొందారు. వైస్ ప్రెసిడెంట్ గా కే నరసింహారెడ్డి, సెక్రటరీగా అంబటి గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీగా మురళీమోహన్ లతో కూడిన పానెల్ ఎంపికైనట్లు ఎన్నికల అధికారి నాగేశ్వరరెడ్డి తెలిపారు. శివరాం రెడ్డి బార్అసోసియేషన్ అధ్యక్షుడిగా విజయం సాధించడం పై సీనియర్ న్యాయవాదులు సూర్యనారాయణరెడ్డి, శ్రీనాథరెడ్డి, మహబూబ్ బాషా, నీలకంఠేశ్వరం తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన వివరామిరెడ్డికి ప్రత్యర్థిగా నిలబడ్డ పత్తి సుబ్బరాంరెడ్డికి డిపాజిట్ కూడా దక్కలేదు.

# గృహ లబ్ధిదారులకు రూ 5.96 కోట్ల అదనపు సహాయం



లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న పీడీ

**చాగలమర్రి,మేజర్ న్యూస్ :** నంద్యాల జిల్లాలో ప్రభుత్వ గృహనిర్మాణాలు చేపట్టిన బీసీ,ఎస్సీ,ఎస్టి,చెంచులకు అదనపు సహాయం క్రింద రూ 5.96కోట్లు జమ చేయడం జరిగిందని జిల్లా హౌసింగ్ పీడీ హరిగోపాల్ తెలిపారు. శుక్రవారం చాగలమర్రి పట్టణంలోనికస్తూరిభా సమీపంలోనిలే అవుట్లలో గృహనిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఎస్సీ,బీసీలకు రూ 50వేలు,ఎస్టీలకు రూ 75వేలు,చెంచులకు లక్ష రూపాయలు అదనపు సహాయం మంజూరు చేసిందన్నారు. జిల్లాలో 9432 గృహాలు లక్ష్యం కాగా ఇప్పటివరకు 4212 గృహాలు పూర్తయ్యాయని మిగిలినవి మే చివరినాటి పూర్తి చేయాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. చాగలమర్రి మండలంలో 260 మంది లబ్ధిదారులకు రూ 38. 42 లక్షలు అదనపు ఆర్థిక సహాయం వారి ఖాతాల్లో జమ చేయడం జరిగిందన్నారు. పిఎంఏవై 2.0 సర్వే ద్వారాగృహాలు మంజూరు కొరకు సంబంధిత సచివాలయాల ఇంజనీరింగ్ సహాయకులను సంప్రదించి ఈ నెల చివరి కల్లా ఆన్‌లైన్‌లోనమోదుచేసుకోవాల న్నారు. .అలాగే ఎన్టిఆర్ హౌసింగ్ మంజూరైన బేస్‌మెంట్ నుండి వివిధ స్థాయిలలో ఉన్న వారు కూడా పిఎంఏవై సర్వేలో నమోదు చేసుకోవాలన్నారు. గతంలో గృహ నిర్మాణాలు చేసుకోకున్న లబ్ధి పొందినట్లు ఆన్‌లైన్‌లో లబ్ధిపొందినట్లు చూపిస్తు ఉంటే అటువంటి వారు తమ వివరాలను కార్యాలయంలో అందజేస్తే వాటిని రాష్ట్ర గృహనిర్మాణ కార్యాలయానికి పంపించి పునరుద్దరించడం జరుగుతుందన్నారు. ఆయన వెంట హౌసింగ్ డీఈ విజయ్‌కుమార్, ఏఈ నరసింహరావు,వర్క్ ఇన్‌స్పెక్టర్ ఓబులేసులు ఉన్నారు.

# పేద ఆర్యవైశ్యులకు కిట్లు పంపిణీ



కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

**వెలుగోడు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని వాసవి కాంప్లెక్స్‌లో ఆర్యవైశ్య మండల అధ్యక్షులు బత్తు రాము, వెలుగోడు మండల మర్చెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బల్లాని వెంకట సత్యనారాయణలు పేద ఆర్యవైశ్యులకు పండుగ కిట్లను పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు భవనాశి నాగమహేష్ ఆధ్వర్యంలో 40 కిట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉగాది సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆర్యవైశ్య కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో తాల్లూరి సంజీవరాయుడు, లాలం నాగార్జున, లాలం మల్లికార్జున, తాల్లూరి రవిప్రసాద్, తల్లం సుమంత్, తల్లం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలను నిర్వీర్యం చేసిన జగన్.. గిత్త

**-: బలోపేతం చేసిన కూటమి ప్రభుత్వం...**
**-: ఉప ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం**
**-: కొణిదెలకు పవన్ ట్రస్ట్ నుండి రూ.50 లక్షల నిధులు**
**-: ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించిన గ్రామస్తులు**



**నందికొట్కూరు రూరల్ మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో గత వైసీపీ ప్రభుత్వం గ్రామపంచాయతీలను నిర్వీర్యం చేసి రాత్రికి రాత్రే నిధులు కాజేసిన వ్యక్తి వైఎస్ జగన్అంటూ ఎమ్మెల్యే గిత్తజయసూర్య మండిపడ్డారు. గురువారం రాత్రి మండల పరిధిలోని కొణిదెల గ్రామంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటానికి కుల ,మతాలకు అతీతంగాపాలాభిషేకంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయడమే పనిగా చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొని అడుగులు ముందుకేస్తుందన్నారు. గతంలో ఎన్నికల ముందు గ్రామాన్ని సందర్శించిన పవన్ కళ్యాణ్ తన ఇంటి పేరుతో రాష్ట్రంలో కొణిదెల గ్రామం ఉండడం ఎంతో సంతోషమని ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గ్రామస్తులకు అప్పట్లో హామీ ఇవ్వడం జరిగింది .2024 ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం తరపున రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న పవన్ కళ్యాణ్‌ను ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మరియు పాణ్యం నియోజకవర్గం ఓర్వకల్ మండలంలోని పూడి చెర్ల గ్రామంలో నీటి కుంటల ప్రారంభోత్సవ కార్యక్రమానికి తవ్వకాల ముఖ్యఅతిథిగా హాజరైన పవన్ కళ్యాణ్ ను నందికొట్కూర్ ఎమ్మెల్యే గిత్త జయసూర్య అభినందిస్తూ నందికొట్కూరు నియోజవర్గంలోని కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటామన్న హామీ గతంలో మీరు ఇచ్చారని ఆయన గుర్తు చేశారు . అందుకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే కోరడంతో స్పందించిన ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తన సొంత ట్రస్టు ద్వారా కొణిదెల గ్రామానికి 50 లక్షల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించడంతో హర్షం వ్యక్తం చేశారు. జనసేన, టిడిపి నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో గ్రామంలో గురువారం రాత్రి ఏర్పాటు చేసిన అభినందన సభలో ఎమ్మెల్యే గిత్త జయసూర్య, టిడిపి సీనియర్ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డిలను ఘనంగా పూలమాలలు వేసి దుశ్యాలువ సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కొంగర నవీన్, శ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి ఆలయ చైర్మన్ సాలే కిరణ్ ,రంగస్వామి, పాణ్యం భాస్కర్,మరియు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే బుడ్డా

**బండిఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని పెద్దదేవలాపురం, బండిఆత్మకూరు, కడమలకాల్వ, యర్రగుంట్ల గ్రామాల్లో శుక్రవారం శ్రీశైలం నియోజకవర్గం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి పలు అభివృద్ధి పనులతో పాటు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సీడితో కూడిన యంత్ర పరికరాలను లబ్ధిదారులకు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని పెద్దదేవలాపురం గ్రామంలో రూ.10 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం బండిఆత్మకూరు మండల పరిషత్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ వారు ఏర్పాటు



సిసి రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

చేసిన సబ్సీడి ద్వారా అందజేసే యంత్ర పరికరాలను 26 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం కడమలకాల్వ గ్రామంలో రూ.24 లక్షల నిధులతో చేపట్టిన సిసి రోడ్లను ప్రారంభించారు. అలాగే యర్రగుంట్ల గ్రామంలో రూ.33 లక్షలతో నిర్మాణం చేపట్టిన సిసి రోడ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత దేశానికి పట్టుకొమ్మలైన గ్రామాలను అభివృద్ధి వైపు నడిపించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. బన్నూరు రామలింగా రెడ్డి, నరసింహా రెడ్డి, మల్లేశ్వర్ రెడ్డి, మధు, అల్లె ఈశ్వర్ రెడ్డి, దేవలాపురం సర్పంచు పెద్దినేని పెద్దన్న, జిసి పాలెం ఉప సర్పంచు లింగా రెడ్డి, సంతజూటూరు సర్పంచు రామచంద్రుడు, నానుగొండ కృష్ణా రెడ్డి, డిష్ రామలింగం, కురువ ప్రసాద్, మధన భూపాల్, చిన్న పాపయ్య, మల్లికార్జున, జనసేన నాయకులు పెద్దస్వామి, గంటాల జయన్న, శ్రీకాంత్,రామలింగం, పాల్గొన్నారు.

# ఆలూరు అభివృద్ధి కూటమి ప్రభుత్వంలో దూసుకుపోతుంది..

**దాదాపు 4 కోట్లతో సిసి రోడ్డు పనులకు జనసేన ఆధ్వర్యంలో శ్రీకారం..**

**ఆలూరు,మేజర్ న్యూస్ :** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ హయాంలో ఆలూరు నియోజకవర్గం అభివృద్ధి లో దూసుకుపోతుందని జనసేన పార్టీ ఆలూరు ఇంచార్జ్ తెర్నెకల్ వెంకప్ప అన్నారు. శుక్రవారం జనసేన ఐటి కో ఆర్డినేటర్ రంజిత్ నివాసంలో వారు మాట్లాడుతూ జిల్లాలో అత్యధికంగా ఆలూరు నియజకవర్గానికి 20 కోట్లకు పైగా సిసి రోడ్లు వేశారని వైసీపీ ప్రభుత్వంలో 2019 నుండి 2024 వరకు ఒక్క సిమెంట్ రోడ్డు కూడా వేయలేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలల్లో 20 కోట్ల సిసి రోడ్లు, ఉప ముఖ్యమంత్రి సహకారంతో మరో నాలుగు కోట్ల రూపాయల తో సిసి రోడ్లు జనసేన పార్టీ వేస్తుందని అలాగే 9 కోట్లతో బిటి రోడ్లు వేస్తుందని తెలిపారు. స్వాతంత్ర్యం తరువాత జిల్లాలో 29 గ్రామాలకు రోడ్లు వేయలేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొన్న ఓర్వకల్లు పర్యటనలో వారి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే జిల్లాలో 29 గ్రామాలకు రోడ్లు వేయడానికి సిద్ధం చేయగా అందులో హొలగుంద మండలంలో ఒక గ్రామానికి రోడ్డు వేశారని తెలిపారు. అలాగే ఓర్వకల్లు లో మంత్రి పవన్ దృష్టికి జోహారాపురం నీటి సమస్య జనసైనికులు తెలపడంతో హంద్రీనీవా నుండి మొలగవల్లి, జోహారాపురం మధ్య సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఏర్పాటుకు అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేయిస్తామని అన్నారు. అలాగే గాజులదిన్నె కు 600 కోట్లు అందించి జిల్లా పశ్చిమ ప్రాంతానికి తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తామని కూటమిలో కొన్ని పొరపాట్లు ఉన్నా అందరం కలిసి ఆలూరు అభివృద్ధి కి కృషి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో ఛత్రపతి,శివ,రాజు లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన ఇంచార్జ్ తెర్నెకల్ వెంకప్ప

# మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మను కలిసిన ఎంపిపి రామాంజినమ్మ

**తుగ్గలి, మేజర్‌న్యూస్ :**

తుగ్గలి మండల ఎంపిపిగా నూతనంగా ఎంపికైన రాచపాటి రామాంజినమ్మ, వైసిపి వాలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షులు ఆర్ హనుమంతులు శుక్రవారం స్థానిక మండల నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మను మర్యాదపూర్వకంగా కలిసి శాలువా,పూలమాలతో సత్కరించారు. గురువారం జరిగిన ఎంపిపి ఉప ఎన్నికలలో ఆర్ రామాంజినమ్మ ఎంపిపిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మ మాట్లాడుతూ నూతనంగా ఎంపిపిగా ఎంపికైన రామాంజినమ్మ స్థానిక వైసిపి నాయకుల సలహాలు,సూచనాలు తీసుకుని ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని తెలిపారు. అలాగే పార్టీ నాయకులు,కార్యకర్తల సమస్యలను కూడా పరిష్కరించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి చెందిన వైసిపి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే శ్రీదేవమ్మను కలిసిన ఎంపిపి ఆర్ రామాంజినమ్మ

సూర్య

శనివారం | 29 మార్చి 2025

## ప్రజల నుండి అర్జీలను స్వీకరించిన మంత్రి బి.సి



అర్జీలను స్వీకరిస్తున్న దృశ్యం

**బనగానపల్లెమేజర్,న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యం ఇస్తామని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారంనాడు బనగానపల్లె క్యాంపు కార్యాలయంలో వారు ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఒక్క బనగానపల్లె నియోజకవర్గం నుండే కాక నంద్యాల జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రజలు వారి సమస్యల పరిష్కారం కోసం మంత్రి బి.సికి వినతీపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజా సమస్యల పరిష్కారానికే మొదటి ప్రాధాన్యాన్ని ఇస్తున్నామని అన్నారు. వచ్చిన అర్జీలలో కొన్నింటికి వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు ఫోన్ ద్వార ఆదేశాలు జారీ చేశారు. అర్జీలన్నీంటిని ఆయా శాఖల అధికారులకు పంపించి వారి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి బి.సి తెలిపారు.

## కన్నడ భక్తుల కోసం ప్రత్యేక రైలు - ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి

**నంద్యాల అర్బన్, మేజర్‌న్యూస్ :** ఉగాది పండుగను పురస్కరించుకొని కర్నాటక, మహారాష్ట్రాల నుంచి వందల కిలోమీటర్ల దూరం కాలినడకన కన్నడ, మరాఠి భక్తులు నంద్యాల జిల్లా శ్రీశైల పుణ్య క్షేత్రం చేరుకొని శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకొని తిరుగు ప్రయాణ సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే శాఖ అధికారులు రైలు సౌకర్యం కల్పించినట్లు నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి తెలిపారు. శుక్రవారం ఎంపీ వివరాలను తెలుపుతూ నంద్యాల, మార్కాపూర్ రోడ్ రైల్వేస్టేషన్ మీదుగా మార్చి 31వ తేదీ సోమవారం నాడు నడవనున్న గుంటూరు - హుబ్లీ - గుంటూరు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలును కర్నాటక, మహారాష్ట్ర వాసులు సద్వినియోగం చేసుకోవాలని, నంద్యాల మీదుగా శ్రీశైలానికి వెళ్లే భక్తులు తిరుగు ప్రయాణంలో కూడా ఉపయోగించాలని ఎంపీ శబరి కోరారు.

## డోన్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి సహకారం అందిస్తా..

**అధ్యక్షుడు శీలం భాస్కర్‌నాయుడు**



ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసిన శీలం భాస్కర్‌నాయుడు

**డోన్, మేజర్‌న్యూస్:** డోన్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి కౌన్సిల్ అభివృద్ధికి సహకారం అందిస్తానని నూతనంగా డోన్ బార్‌అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నుకోబడిన లాయర్ శీలం భాస్కర్‌నాయుడు అన్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధిక మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంతటి ఘనవిజయం అందించిన తోటి బార్ అసోసియేషన్ సభ్యులకు, సీనియర్ న్యాయవాదులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. నావంతు కృషిగా డోన్ బార్ అసోసియేషన్ అభివృద్ధికి సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం డోన్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాశ్‌రెడ్డిని శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు మర్యాదపూర్వకంగా కలిశారు. న్యాయవాదుల సంక్షేమం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఆయనతో పాటు వేణుగోపాల్‌నాయుడు, వెంకటనాయునిపల్లె సర్పంచ్ శీలం చంద్రశేఖర్‌నాయుడు, శీలం మనోహర్‌నాయుడు, శీలం రామాంజులునాయుడు, శీలం రాజేష్‌నాయుడు, శీలం శ్రీనాథ్‌నాయుడు, సీనియర్ న్యాయవాది టి.కృష్ణమూర్తి, ఎస్.బాలకృష్ణ, అగ్గి మోహన్, దొరపల్లె రాముడు, మద్దయ్య, ఉడుములపాడు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## మెడికవర్, శివాని హాస్పిటల్స్ తనిఖీ చేసిన జిల్లా వైద్యాధికారి



**కర్నూలు క్రైం, మేజర్‌న్యూస్ :** నగరంలోని మెడికవర్, శివాని హాస్పిటల్స్‌ను జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి శాంతికళ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె హాస్పిటల్ మరియు స్కానింగ్ కేంద్రం నందు రికార్డులు,రిపోర్టులు పరిశీలించారు. హాస్పిటల్ మరియు స్కానింగ్ కేంద్రాల యాజమాన్యం రికార్డులు, రిపోర్టులు నిబంధనల ప్రకారం నిర్వహించాలన్నారు. వైద్యుల అర్హత సర్టిఫికేట్లు మరియు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్లు డిస్ప్లే చేయాలని, లింగనిర్ధారణ పరీక్షలు నిర్వహించరాదన్నారు. హాస్పిటల్ మరియు స్కానింగ్ కేంద్రాల రిజిస్ట్రేషన్ మరియు రెన్యువల్ కొరకు కొన్ని అర్హత ప్రమాణాల ప్రకారం నందు అప్లై చేయాలన్నారు. ఈ కార్యక్రమంలోడిఈఎంఓ శ్రీనివాసులు శెట్టి, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి,ఆరోగ్య విద్యాబోధకురాలు పద్మావతి, మానిటరింగ్ కన్సల్టెంట్ సుమలత, ప్రాజెక్ట్సనిస్ట్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయాలను సబ్ కలెక్టర్ సందర్శన

**మంత్రాలయం రూరల్, మేజర్ న్యూస్ :** మంత్రాలయం మండల పరిధిలోని రచ్చుమర్రి, సుంకేశ్వరి, మాలపల్లి గ్రామాల్లో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సందర్శించారు. గ్రామాల్లో ఉన్న సచివాలయాలను సబ్ కలెక్టర్ తనిఖీ చేసి పిజిఆర్ఎస్ వచ్చినా ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులనుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం మంత్రాలయం మండలంలోని రీసర్వే పైలేట్ ప్రాజెక్టుగా ఎన్నికైన చట్నేపల్లి గ్రామంలో రీసర్వే ప్రక్రియను సబ్ కలెక్టర్ ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రవి, డిప్యూటీ తహశీల్దార్ సరస్వతమ్మ, మండల సర్వేయర్ ఆశోక్, విఆర్ఓ ఆనంద్, నరసప్ప, సర్వేయర్ తిమ్మేష్, తదితరులు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా కిట్లు పంపిణీ చేసిన మంత్రి టీజీ.భరత్



**కర్నూలు, మేజర్ న్యూస్ ప్రతినిధి :** కర్నూలు నగరంలోని మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ టేకర్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ తోఫా కిట్లు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టీజీ భరత్ ముఖ్య అతిథి గాహాజరయ్యారు.వందమందికి రంజాన్‌తోఫాకిట్లను అందించారు. ఈ సందర్భంగా టీజీ భరత్ మాట్లాడుతూ మహమ్మదీయ వక్ఫ్ కాంప్లెక్స్ కేర్ కమిటీ ఆధ్వర్యంలో ఎన్నో మంచి కార్యక్రమాలు చేస్తున్న కమిటీ సభ్యులను అభినందిం చారు. మంచి చేసేవాళ్లను ప్రజలు ప్రోత్సహిస్తే మరిన్ని మంచి కార్యక్రమాలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. మంచి చేసేది ఎవరో ప్రజలు గ్రహించాలని ఆయన కోరారు. తమ ప్రభుత్వ హయాంలో కర్నూలు జిల్లాకు ఎన్నో పరిశ్రమలు వస్తాయని.. యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మంత్రి చెప్పారు. దేశంలోనే మంచి విద్యా వ్యవస్థ ఆంధ్రప్రదేశ్లో ఉండేలా చేసేందుకు మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు ఇబ్రహీం, రబ్బాని, మహబూబ్, మునాఫ్, రమీజ్, తదితరులు పాల్గొన్నారు.

## తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులు పంపిణీ

**పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి బి.సి**



సభ్యత్వ కార్డులను పంపిణీని ప్రారంభించిన మంత్రి బి.సి

**బనగానపల్లెమేజర్,న్యూస్:** దేశ చరిత్రలో ఒక ప్రాంతీయ రాజకీయ పార్టీలో కోటి మంది పార్టీ సభ్యత్వాలు నమోదు కావడం తెలుగుదేశం పార్టీ యువనాయకుడు నారా లోకేష్ ఆధ్వర్యంలో సాధ్యమైందని రాష్ట్ర రోడ్లు భవనాల శాఖా మంత్రి బి.సి జనార్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం నాడు బనగానపల్లె మంత్రి క్యాంపు కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని మంత్రి బి.సి ప్రారంభించారు. క్లస్టర్ ఇంచార్జిలే ఈ కార్డులను సభ్యత్వం తీసుకున్న ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బనగానపల్లె నియోజకవర్గాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని తెలుగుదేశం పార్టీ సభ్యత్వాలను రికార్డుస్థాయిలో 63వేల వరకు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు అనుకోని పరిస్థితుల్లో ప్రమాదం జరిగినప్పుడు వారిని ఆదుకోవాల్సిన బాధ్యత తెలుగుదేశం పార్టీ తీసుకొని వారందరికీ పార్టీ సభ్యత్వంతోపాటు ఆరోగ్య, జీవిత భీమా అందజేయడం జరుగుతుందన్నారు. ఏమైనా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయిన ఈ సభ్యత్వ కార్డు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతంలో 3లక్షలు ఉన్న ప్రమాద భీమా నేడు 5లక్షలకు పెంచడం జరిగిందన్నారు. ఈ సభ్యత్వ కార్డు ఉన్న కార్యకర్త చనిపోతే 5లక్షలు అందజేస్తామన్నారు. బనగానపల్లె నియోజకవర్గంలో ప్రతి గ్రామం నుండి పెద్ద ఎత్తున కార్యకర్తలు సభ్యత్వం తీసుకోవడం జరిగిందన్నారు. కుటుంబంలో పెద్దదిక్కును వివిధ కారణాలతో కోల్పోతే ఆ కుటుంబాన్ని అక్కున చేర్చుకొని వారి బిడ్డలను ఎన్.టి.ఆర్ ట్రస్ట్ ద్వార చదివిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. కార్యకర్తల సంక్షేమం కోసం నిధి ఏర్పాటు చేయడం జరిగిందని కేవలం కార్యకర్తల భీమా సొమ్ము మాత్రమే కాకుండా లోకేష్ నాయకత్వంలో పార్టీ వారి సంక్షేమానికి సొంత నిధులు కేటాయిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్త అని గర్వంగా చెప్పుకొని తిరిగేలా ఒక లైసెన్స్ మాదిరి ఈ కార్డును రూపొందించడం జరిగిందన్నారు. ఈ సభ్యత్వ కార్డులను ఓటు ఇంచార్జిల ద్వార స్థానిక నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలకు అందజేయడం జరుగుతుందని తెలిపారు.

## నంద్యాల మార్కెట్ యార్డు ఛైర్మెన్‌గా గుంటుపల్లి హరిబాబు

- **ప్రజా సేవకు అవకాశం**
- **ముఖ్యమంత్రి, నారా లోకేష్ , ఫరూక్‌లకు కృతజ్ఞతలు**



నంద్యాల మార్కెట్ యార్డు ఛైర్మెన్‌గా గుంటుపల్లె హరిబాబు



హరిబాబుకు శుభాకాంక్షలు తెలుపుతున్న స్నేహితులు

**నంద్యాల, మేజర్‌న్యూస్ బ్యూరో :** నంద్యాల మార్కెట్ యార్డు ఛైర్మెన్‌గా గుంటుపల్లె హరిబాబును నియమిస్తూ ఉత్తర్వులను జారీ చేసింది. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం పార్టీ మూడవ విడత నామినెటెడ్ పదవులను భర్తీ చేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసిన వారికి నామినెటెడ్ పదవుల్లో టీడీపీ అధిష్టానం అవకాశం కల్పిస్తుంది. శుక్రవారం రాష్ట్రంలోని 47 మార్కెట్ కమిటిలకు చైర్మన్లను ప్రకటించింది. అందులో 705 నామినెటెడ్ పదవులు భర్తీ కానున్నాయి. 47 ఛైర్మెన్ పదవుల్లో 37 టీడీపీ, 8 జనసేన, 2 బీజేపీకి దక్కాయి. నంద్యాల మార్కెట్ యార్డు ఛైర్మెన్‌గా సీనియర్ నాయకుడు గుంటుపల్లి హరిబాబును ఎంపిక చేసింది. ఆయన మేజర్‌న్యూస్‌తో సాయంత్రం మాట్లాడారు. తెలుగుదేశం పార్టీలో కష్టపడిన వారికి పదవులు దక్కుతాయన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి తెలుగుదేశం పార్టీలోనే కొనసాగుతున్నట్లు తెలిపారు. తన తండ్రి ప్రజలకు సేవ చేశారని, ఇప్పుడు ప్రజలకు సేవ చేసే అవకాశం కలిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశానన్నారు. తనను ఎంపిక చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, ఫరూక్‌లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాజకీయాలతోపాటు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలను చేపట్టానని తెలిపారు. తన తండ్రి వెంకటేశ్వర్లు సర్పంచ్‌గా పని చేశారని గుర్తు చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శిగా పని చేశారన్నారు. నంద్యాల మండలం చాబోలు సహకార సంఘం ఉపాధ్యక్షులుగా పని చేశారన్నారు. 1995లో రైతునగరం ఎంపీటీసీగా గెలుపొందారన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లా ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షులుగా పని చేశారన్నారు. 2006లో రైతునగరం సర్పంచ్‌గా పని చేశారన్నారు. తన తల్లి కోటేశ్వరమ్మ 1980 నుంచి 1987 వరకు నంద్యాల మండల సమితి కో ఆప్షన్ మెంబర్‌గా పని చేశారన్నారు. 2020లో తెలుగుదేశం పార్టీ తనను రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నియమించిందన్నారు. 2023లో రాష్ట్ర ఉపాధ్యక్షులుగా రైతు విభాగానికి పని చేశానన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు పలు నియోజకవర్గాలకు పరిశీలకుడుగా పని చేశానన్నారు. ప్రస్తుతం మార్కాపురం నియోజకవర్గం పరిశీలకుడిగా ఉన్నానన్నారు. టీడీపీ ఆవిర్భావం నుంచి తమ కుటుంబం అదే పార్టీలో కొనసాగుతుందన్నారు. ఆయనను పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు కలసి శుభాకాంక్షలు తెలిపారు. రైతు నగరంలో బాణసంచా పేల్చి సంబరాలు జరుపుకున్నారు.

## ఇంట్లోకి దూరిన దొంగ.. బెదిరించి బంగారు గొలుసు చోరీ

**ఆదోని టౌన్, మేజర్ న్యూస్:** అందరూ చూస్తుండగా ఓ దొంగ హల్‌చల్ చేశాడు. ఇంట్లోకి దూరి కత్తితో భయపెట్టి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్ళాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. శుక్రవారం సాయంత్రం 7 గంటల సమయంలో ఆదోని పట్టణం వెంకన్న బావి పేటలో ఓ ఇంట్లోకి దొంగ చొరబడ్డాడు. అప్పుడు లక్ష్మీశ్వేత అనే మహిళతో పాటు ఇద్దరు పిల్లలూ ఇంటి లోపలే ఉన్నారు. దొంగ ఆమెకు కత్తి చూపించి మెడలోని 5 తులాల బంగారు గొలుసును లాక్కొని అక్కడినుంచి ఉడాయించినట్లు సమాచారం. పూర్తి సమాచారం తెలియాల్సివుంది. విషయం తెలుసుకున్న టూ టౌన్ సీఐ రాజశేఖర్ రెడ్డి పోలీసు సిబ్బందితో అక్కడికి చేరుకుని బాధితురాలిని విచారించారు. ఈ ఘటనతో పట్టణ ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు.